కూనలమ్మ కోన

శ్రీ మధురాంతకం రాజారాం

రెక్కలతలుపులు కిర్రున తెరుచుకున్నాయి. ద్వారంలోనుంచి వడగాలి రివ్వురివ్వున లోపలికి కొట్టింది. గాలి దెబ్బకు టేబిలుమీదవున్న కాగితాలన్నీ పైకెగిరి గదంతటా చెల్లాచెదరుగా పడిపోయాయి. అన్నీ ఒకేరకం కాగితాలు. పైన ఎరుపు, క్రింద పసుపు పూతలో స్వర్ణాక్షరాలు ధగధగమని మెరిసిపోతున్న శుభలేఖలు!

చీపురు చేతపట్టుకుని లోపల అడుగుపెట్టిన నాగరత్నం గదిలో గాలిపటాల్లా ఎగురుతున్న శుభలేఖల్ని చూచి నివ్వెరపోయింది. నాగరత్నానికి చదువురాదు. ఐనా అవి పెళ్లిపత్రికలని పోల్చుకోడానికి కావలసినంత లోకజ్ఞానం మాత్రం ఆమెకు లేకపోలేదు.

నాగరత్నం ఒక పత్రికను చేతికి తీసుకుంది. గదిలో దీపం వెలగడంలేదు. ఇంటిలో ఎందరు పనిమనుషులున్నా, ఆ గదిలో వత్తి ఊడ్చి దీపం వెలిగించే చొరవ వాళ్ళకెవ్వరికీ లేదు. తరతరాలుగా ఆ బాధ్యత, కాకుంటే అధికారం ఆ యింటి గృహిణికి మాత్రమే పరిమితం. రంగనాథంగారి భార్య తనబాధ్యతలకు, అధికారాలకు స్వస్తివాచకం పలుకుతూ కళ్లుమూసుకపోయి ఏడాది కావస్తోంది. ఈ ఏడాదిపొడుగునా సంజవేళల్లో గదితలుపులుతీసి, వత్తిఊడ్చి దీపం వెలిగించడం నాగరత్నానికి అలవాటయింది. ఆగదికి, నాగరత్నానికీ వున్న సంబంధం అంతమాత్రమే కాదు. ఆగదితలుపులు తెరచినప్పుడు, లోపల నిలువుటద్దంముందు నిలుచున్నప్పుడు టేబిలుకు ఆనుకున్నప్పుడు ఎన్నో మధురభావనలు ఆమె చిత్తంలో కదను త్రొక్కుతాయి. ఎన్నో మధురస్మృతులు ఆమె హృదయాన్ని వివశం చేసివేస్తాయి. వెన్నెలలాంటి ఆ అనుభూతిలో హేమంతంలో చలికి వణికిపోతూ కాళ్లుచేతులు ముడుచుకుని ప్రియుడి కడుపులో దూరుకపోయే అడవి చెంచితలా ఆమె పరవశించిపోతుంది.

నాగరత్నానికి ఏడో యేడు జరుగుతుండగా ఆమె తల్లి చనిపోయింది. అప్పటికి నాగలింగానికి నాలుగేళ్లు. నాగరత్నానికింకా కలగా జ్ఞాపకం వుంది. నాగులవాడి పొలాల మధ్య పూరిపాక. పాకలో ఒకవైపున అమ్మ పొయిదగ్గర వంట చేసుకుంటూవుంటే తను గడపదగ్గర కూచుని తమ్ముడితో ఆడుకుంటూ వుండేది. ప్రొద్దు పుట్టకముందే బయటకు వెళ్ళిపోతే, మళ్లీ ఏ రాత్రివేళప్పుడో నాన్న యింటికివచ్చేవాడు. అమ్మ ఎందుకో ఎప్పుడూ భయపడుతూ వుండేది. 'ఎందుకే అమ్మా నువు భయపడ్డం' అని తనొకనాడు తరచితరచి అడిగితే 'ఇది జగడాలకొంప తల్లీ! మాటెత్తితే టక్కున దుండుగా కత్తులూ, కటార్లూ కావలసివస్తాయి. ఆ తర్వాత కాళ్లు పొయ్యేది, చేతులు పొయ్యేదీ, తలలే ఎగిరిపొయ్యేదీ ఒక్కటే తెలియదు' అంటూ నిట్టూర్చింది. అమ్మ చాలా మంచిది. నాన్న త్రాగివచ్చి తిట్టినా, కొట్టినా, పల్లెత్తుమాట అనేదికాదు. తనకు తలదువ్వి, జడవేసి పూలుముడిచి 'నలుపు రూపయితే నేం! నా తల్లి కళ్లల్లో దీపాలెలుగుతాయి' అంటూ ముద్దాడేది. లోకం పాపిష్టిది! పచ్చి అని పట్టి ఎరుగని, ఎండు అని విరిచిఎరుగని అమ్మకుకూడా ఈ లోకంలో కష్టాలు వచ్చాయి. ఓ అర్ధరాత్రివేళ, నాన్న యింట్లో లేడు. అమ్మ తననొక చేతి తమ్ముడినొక చేత బరబరాబయటకులాక్కుపోయింది. అమ్మో, తలచుకుంటే యిప్పటికీ గుండె గుబగుబలాడి పోతుంది! అదేం మంట. పూరి బుస్సుబుస్సుని మండుకుంటోంది. వాసాలు చిటచిట లాడిపోతూ ఎగిరెగిరి దూరంగా పడుతున్నాయి. అంత మంటలోనూ వద్దన్నా వినక అమ్మ లోపలికి పరుగెత్తి నాలుగైదు కడవల్ని బయటకు తెచ్చుకుంది. చివరి సారి ఆమె బయటికి వస్తుండగా ద్వారబంధం విరిగి తలపైన పడింది. ఉలవకాయలున్న కడవను నేలపైన్నే విడిచి అమ్మ అక్కడే పడిపోయింది. అంతే ఇక కళ్ళు తెరవలేదు. 'పాపం, వట్టిమనిషి కూడా కాదు' అని ఆ తర్వాత అందరూ చెప్పుకోగా తనకు తెలిసింది. అమ్మ చనిపోయిన క్రొత్తలో కడుపులోవున్న మనిషి చస్తే కాటకాలొస్తాయనుకున్నారు. ఆ మాటకొస్తే ఈ కూనలమ్మ కోనలో కాటకం లేని దెప్పుడు?

ఇంతకన్నా నాగరత్నానికి తన తల్లినిగురించి తెలిసిందేమీ లేదు. కాని తండ్రితో ఆమెకున్న పరిచయంతో పోల్చిచూస్తే అదే ఎక్కువనిపిస్తుంది. ఎప్పుడూ త్రాగుడువల్ల ఎరుపెక్కిన కళ్ళతో నోటిలోనుంచీ నాసికారంధ్రాల్లోనుంచీ బుస్సుబుస్సని సుళ్లు తిరుగుతూవచ్చే నాసెడు పొగచుట్ట తాలూకు తెల్లటి పొగలతో నిరంతరం మత్తులో జోగుతూ కానవచ్చే ఆ ఉగ్రస్వరూపంలో నాగరత్నాని కేనాడూ పితృత్వం పొడకట్టలేదు. తల్లి చనిపోయిన తర్వాత కూతురికీ తండ్రికీ మధ్య ఎడము సన్నగిల్లినమాట నిజమే. కానీ తీరా విన్నపడే వేళకు బావ పగిలిపోయింది. ఏడేళ్ళ దుర్భిక్షం తర్వాత లేక లేక ఆకసంలో కన్పించిన కారుమబ్బు హాదపడి పటాపంచలు చేసివేసే సుడిగాలిలా, విధి అప్పుడప్పుడే పితృవాత్సల్యానికి నోచుకుంటున్న నాగరత్నాన్ని చిన్నచూపుచూచి వరసయ్యను తీసుకెళ్ళి కటకటాల్లో పారవేసింది. ఒకటి రెండేళ్లు కాదు. పదహారేళ్ళ సుదీర్ఘ ప్రవాసం! అప్పట్లో నాగరత్నానికి కారణం సరిగ్గా తెలిసిందికాదు. అవి రంగనాథంగారు క్రొత్తగా కారు కొన్న రోజులు. ఓ రోజు సాయంత్రం ప్రొద్దు గూటిలో పడబోతున్న వేళగా కారువచ్చి ముంగిటిముందు ఆగింది.

ముందట రంగనాథంగారు, ఆయన వెనుక నరసయ్య కారులో నుంచి దిగి అదరా బాదరా మేడపైకి వెళ్ళిపోయారు. ఊళ్ళో జన మంతా కారుచుట్టూ ప్రోగయింది. రక్తపుమడుగులో మునిగి తేలి వచ్చిన తెప్పగానీ, అదికారుగాదు! గడియల్లో పోలీసు స్టేషనుకు కబురు వెళ్ళింది. ఆనాటికే కూనలమ్మ కోనకు ప్రత్యేకంగా ఓ పోలీసు స్టేషను ఏర్పడి ఎంతోకాలమయింది. అమాటకొస్తే ఒకటికి రెండు పోలీసుస్టేషనులున్నా వాటికి కూనలమ్మకోనలో వూపిరి సలు పని నిర్విరామ కార్యకలాపా లుండకపోవు. కబురందగానే సబ్ యిన్స్పెక్టరు టెక్కులు గట్టుకుని పరుగెత్తి వచ్చారు. కేసును పకడ్బందీగా రూపొందించుకోడానికి అతనికి పరిస్థితులన్నీ అను కూలించాయి. వేడినెత్తురులో అరకొరగా జలకమాడిన కారు భవనం ముందు ప్రత్యక్ష సాక్ష్యంగా ప్రదర్శింపబడుతోంది. పైగా నేర స్థుడే స్వయంగా తన అపరాధాన్ని ఒప్పుకుంటున్నాడు. తనకు కారు నడపడం సరిగ్గా చేతకాదు. అయ్యగారు వెనుక సీటులో కూచుని మరా మేకు కదిలించడం నేర్పుతుండగా తను యిప్పు డిప్పుడే డ్రయివింగు నేర్చుకుంటున్నాడు. కారు రాకను చూచి గూడా సింగప్ప పైదొలగకుండా త్రోవలో నిల్చున్నాడు. కాలం చేస్తుంది! ఆ వేగంలో కారు సింగప్పను తాకింది. సింగప్ప కారు కడ్డంగా పడిపోయాడు. కారు సింగప్పపైన్నే వెళ్ళిపోయింది.

పోలీసులు నరసయ్యచేతికి బేడీలు తగిలించారు. నాగరత్నానికి బేడీలంటే ఏమిటో తెలిసీ తెలియని వయస్సు. ఐనా తండ్రి ఎక్క డికో వెళ్ళిపోతున్నాడనీ, అతడు తిరిగి రావడానికి చాలా కాలం పట్ట వచ్చునని ఆమె కర్థమయింది. నాగరత్నం నరసయ్య కాళ్ళకు చుట్టు కుని 'మళ్ళీ ఎప్పుడొస్తావు నాన్నా' అని అడిగింది. నరసయ్య బేడీ లున్న చేతుల్తోనే కుమార్తెను పైకెత్తుకుని ఆమె తలను రొమ్ముకు హత్తుకున్నాడు. వాతావరణ ప్రభావాలకు చలించని కర్క శ పాషాణంలాంటి నరసయ్య ముఖంలోకి ఇది అది అని ఊహించడానికి వీలుకాని మార్పేదో ఆ క్షణాన చూపరులకు గోచరించింది. అతడి పెదవులు అప్రయత్నంగా కంపించిపోయాయి. కంటిరెప్పలు క్రిందికీ మీదికీ నాలుగైదుసార్లు కొట్టుకున్నాయి. అతడి కళ్ళు కుమారుడికోసం జనంలో అటూ, ఇటూ పరికించాయి. కాని నాగ లింగం కనిపించలేదు. పిసింద్రీలాంటి ఆ ఆరేళ్ల పసికుంక ఏ అమ్మ పెట్టిన అన్నంతిని ఏ పసువులకొట్టంలోపడి నిద్రపోతున్నాడో ఎవ రికి తెలుసు! నరసయ్య నాగరత్నాన్ని తీసుకెళ్లి రంగనాథంగారి ఎదుట నిలబడ్డాడు. రంగనాథంగారు చేతులు చాపారు. కానీ నరసయ్య కుమార్తెను రంగనాథంగారి చేతుల్లో వుంచలేదు. వంగి ఆయన పాదాలచెంత కూర్చోబెట్టాడు. మళ్లీ నిటారుగా నిలబడి గిరుక్కున వెనుదిరిగి, తిరిగిచూడకుండా వీధివెంబడే వెళ్లిపోసాగాడు!

నరసయ్య రక్షకభటుల్ని వెంబడించలేదు. రక్షకభటులే నర సయ్యను వెంబడించారు!

అంత ఊళ్ళో నరసయ్య అలా వెళ్ళిపోతున్నందుకు ఒక్క నాగరత్నంమాత్రమే కన్నీరు మున్నీరుగా విలపించింది.

నెలకు రెండు మూడు వాయిదాలుగా నాలుగైదు నెలలపాటు న్యాయస్థానంలో కూనలమ్మకోన కారుప్రమాదంపైన విచారణ జరి గింది. వాయిదాకు వాయిదాకు క్రొత్తవిషయాలు బయటపడ్డాయి. తనకూ సింగప్పకూ ఆదినుంచీ ప్రబలవైర ముందని నిందితుడు అంగీక రించాడు. జ్యూరీసభ్యులు ఒకరిముఖం ఒకరు చూచుకున్నారు. ఈ ప్రమాదం ఐచ్ఛికంగా గూడా జరిగివుండవచ్చుననుకోడానికి అవ కాశం లేకపోలేదని వాళ్లు అభిప్రాయపడ్డారు. అంతటితో కేసు తల్లక్రిందులైపోయింది. కారుప్రమాదం దారుణమైన ఖూనీ వ్యవహా రంగా పరిణమించింది!

నరసయ్య ప్రవాసగతుడైననాటికి నాగరత్నానికి యింకా పదేళ్లు నిండలేదు. లంకలాంటి ఆ భవంతిలో ఆమెకు నిర్దిష్టమైన పనంటూ ఏదీ లేదు. కానీ పల్చటి ఒంటిపైన పరికిణీ వేసుకోడానికి తగిన ఆ వయసులో నాగరత్నం చిటారుకొమ్మలో కూర్చుని చింతచిగురు కోసింది. మేడకునిచ్చెన వేసి పదినిలువులెత్తున్న గోడలకన్నింటికీ వింటి దబ్బలావంగి సున్నంకొట్టింది. తొలికోడిపలకరింపుకే లేచి, మహల్లో తలుపులు బారగిల తెరచి 'లేవండి, లేవండి' అంటూ ఇంకా పడక వీడని పాలేళ్ళ కర్ణకుహరాలలో శంఖధ్వానాలు చేసింది. ఇంతకూ ఈ యింటికీపిల్ల ఏమవరు? పరిచారికలా పనిచేస్తూ, స్వంతమనిషిలా బాధ్యత వహిస్తూ, యింటి పెద్దలా అందరి బాగోగుల్ని తెలుసు కుంటూ కురంగంలా యింటా బయటా కలయదిరిగే ఈ అమ్మా యికి ఈ యింటిలో వున్న స్థానమేమిటి? ఏమో, ఏమిటో ఆలో చించిన వాళ్ళెవరూ లేరు.

రంగనాథంగారి భార్యపేరు వరలక్ష్మి. వరలక్ష్మికి దేవు డిచ్చిన వరమల్లా ఒక్కటే ఒక్కటి. ఆమె లౌకికవ్యవహారా లన్నింటిపట్లా నిర్లిప్తత వహిస్తుంది. సంతానం కలగడంలో జాప్యం కలగనూ కలగనూ ఆమె దృష్టి పూజాపురస్కారాలవైపు తీర్థయాత్రల వైపు మళ్ళింది. ఒక్కొకసారి తీర్థయాత్రకు బయలుదేరితే ఆమె ఏడెనిమిది పుణ్యక్షేత్రాలు దర్శించుకుని ఏ రెండుమూడు నెలలకో తిరిగి వచ్చేది.

వచ్చినరోజు సాయంత్రమో, లేకుంటే ఆ మరునాటి ఉద యమో రంగనాథంగారు "ఏం, అప్పుడే తిరిగొచ్చేశావు" అని భార్యను పలకరించేవారు.

భగవంతుడు వరలక్ష్మికి యివ్వడానికి మరచిపోయిన సుగు ణాలలో మాటకారితనం ముఖ్యమయినది. అథవా మాటాడినా, ఆమె అసంబద్ధంగా మాటాడుతుంది.

"ఏం లేదు. మరీ...మిమ్మల్ని చూడాలని బుద్ధి పడింది అందుకని..." అంటూ ఆమె నసిగేది.

రంగనాథంగారు ఫక్కున నవ్వి, "నీ బుద్ధినేం చేద్దామా అని చాలరోజులనుంచీ ఆలోచిస్తున్నాను. అది ఒకసారి తిరుపతి వేంక టేశ్వరుడి పైకి వెళుతుంది. మరోకసారి పానకాలరాయుడి పైకి వెళుతుంది. ఇంకొకసారి కదిరి నరసింహస్వామిపైకి వెళుతుంది. కానీ కడకు ఎప్పుడు లేచినా రాళ్లవంక దగ్గరే తెల్లవారినట్లు అది నాపైకి వచ్చి వ్రాలిపోతుంది. అంటే నీకు వచ్చిన పూజావిగ్రహాలలో నాది చిట్టచివరి దన్నమాట! ఇదుగో నాగరత్నం! కొత్త కర్పూరమూ, ఒక కొబ్బరికాయా పట్టుకురా. మీ అక్క పూజచేసుకోనీ" అనే వాడు.

వరలక్ష్మి ముఖం వెలవెలపోయేది. అది పరాగమో, పరిహాసమో, లేక మొదటినుంచీ భర్త తన పట్ల కనబరుస్తున్న నిరాదరణ తాలూకు విశ్వరూపమో ఆమెకు అర్థమయ్యేది కాదు.

భర్త దూరంగా వెళ్లిపోగానే వరలక్ష్మి నాగరత్నాన్ని దగ్గరకు పిలిచి "అది కాదే నాగరత్నం! నీళ్లు తాగేసినట్లు మీ మావయ్య అలా గడగడా మాట్లాడేస్తారే! ఆయన మాటలు నీకేమైనా అర్థమౌతాయా?" అని అడిగేది.

"ఆయన మాటలు అర్థమైనా కాకపోయినా యిప్పుడొచ్చిన చిక్కంతా నీతోనే అక్కా! నువ్వు యింట్లో వుంటావు. కానీ యింటి సంగతులు పట్టించుకోవు. ఎక్కడికో వెళ్తావు. మళ్ళీ నీకిష్టమొచ్చినప్పుడు తిరిగొస్తావు. ఇలాగైతే ఎలా జరుగుతుందని! గడియారానికి కీయిచ్చినట్టు రోజు కొకసారి 'నేనొకతె నున్నానండోయ్! అంటూ ఆడది మగవాడి చెవి నులుముతుండాలి."

అప్పటికి నాగరత్నంలో యౌవనం పొంగు లొడిగింది. ఆ యౌవనోదయావసరంలో కాలపురుషుని కుంచె రెండు మూడేళ్ళ పాటు నిర్విరామంగా నాగరత్నం ఆకృతికి మెరుగులు దిద్దింది. బాల్యంలో గెంతడం అన్న పేరుతో చలామణీ అయిన ఆమె నడక, యౌవనంలో అదొక నాట్యంలా చూపరుల కళ్లకు భాసించింది. చేతులు త్రిప్పి, త్రిప్పి మాట్లాడడం అదొక అభినయంలా గోచరించింది. అప్పుడామె నవ్వితే పాలి నవ్వని అపహాసించినవారు యిప్పుడామె నవ్వితే రతనాలు రాలిపడ్డవని ఉత్ప్రేక్షించింది. నిజమే! ప్రకృతి చిత్రమైంది. ఈ ప్రకృతిలో ఒక అసహ్యకరమైన పురుగు తనకు కాలం రాగానే సృష్టిసౌందర్యానికి తార్కాణ ప్రాయంగా అందాల సీతాకోక చిలుకగా పరిణామం చెంది రెక్కలాడించుకుంటూ ఎగిరిపోతోంది. ఈ పరిణామంతో పోల్చిచూస్తే నాగరత్నంలో వచ్చిన మార్పు చాలా స్వల్పం! పుట్టుకతో ఆమె రత్నం కాదు, రత్నం ఎరుపుగా ఉంటుందేమో! పోనీ, పుట్టుకతో ఆమె ఇంద్రనీలం! యౌవనం చేసిన పనల్లా ఒక్కటే. మణికి సాన పెట్టింది. అంతటితో ఇంద్రనీలం మెరుగులు గ్రక్కింది.

ఓరోజు మధ్యాహ్నం మూడుగంటలవేళ నిద్రలేచి సిగరెట్టు ముట్టించుకుంటూ మేడమెట్లు దిగుతున్నారు రంగనాథంగారు. హాల్లో ముక్కాలిపీటపైన కూర్చుని వరలక్ష్మి నాగరత్నానికి తల దువ్వి జడవేస్తోంది. పువ్వుల వాయిల్ చీరపైన తెల్లటి జాకెట్టు తొడిగి, తల వంచుకుని అరమోడ్పుకన్నులతో కూర్చునివుంది నాగరత్నం. దిగుతూ దిగుతూవున్న రంగనాథంగారు ఓ మెట్టుమీద ఆగి అలాగే అప్రతిభులై నిల్చుండిపోయారు. నాగరత్నంలో ఏ ప్రత్యేకతను చూచి ఆయన విస్మయచకితులైపోయారో ఊహించడం కష్టం! ముఖకవళికలను చూచి మనసులో మెదిలే భావాల్ని గ్రహించవచ్చునన్న మనశ్శాస్త్ర సిద్ధాంతానికి రంగనాథంగారొక మినహాయింపు! బహుశా ఆయన దృష్టి నాగరత్నం కళ్ళపైన పడివుండవచ్చు. అవి అజంతా నాగసుందరి నయనాల్లా మొదటి చూపుకు దేన్నో చూస్తున్నట్టు కనిపించినా, కడకు దేన్నీ చూడనట్టే గోచరమౌతున్నాయి. ఒకవేళ ఆయన నిగనిగలాడిపోతున్న నీలాలకాలపైన వరలక్ష్మి అర్థచంద్రాకారంగా ముడుస్తున్న మల్లెపువ్వుల్ని చూచి వుండవచ్చు. ఆ పువ్వుప్రథ వాయిల్‌చీరలో ఒదుగుకుపోతూ చిక్కబడిపోయివున్న జవ్వనపుసిరులన్నింటికీ మకుటాయమానంగా ప్రకాశిస్తోంది.

రంగనాథంగారు చరచరా మెట్లు దిగి, ఒక కుర్చీని వరలక్ష్మికి దగ్గరగా లాక్కుని అందులో కూచున్నారు.

వరలక్ష్మి తలపైకెత్తి రంగనాథంగారిని చూస్తూ "అదేమిటండీ! మన నాగరత్నమే! ఎప్పుడూ చూచి ఎరగనట్టు, అలా చూస్తున్నారేం" అంది.

"ఉండక్కయ్యా! నేను చెబుతాను. మావయ్య చూపు లెలావున్నాయో తెలుసా! రాత్రి నేను లాంతరు లోపలపెట్టి తలుపులు మూసేద్దామని వరండాలోకి వెళ్లాను. దీపంచుట్టూ అవేవో చిన్న పురుగులు తిరుగుతున్నాయి. నీడలోనుంచి ఓ కప్ప వాటివైపు చూస్తోంది. చూచిచూచి, ఉన్నట్టుండి ఒక గంతువేసి, నాలుకచాపి పురుగును నోట్లో వేసుకుని మరుక్షణాన్నే మళ్ళీ నీడలోకి వెళ్ళిపోయింది."

"అంటే ఏమిటంటే" అని విరగబడి నవ్వేశారు రంగనాథంగారు. నవ్వినవ్వి "నేనాకప్పలా నాగరత్నాన్ని చూస్తున్నానన్న మాట వరలక్ష్మీ! నువ్విలా కూచునివుండగానే నేను దీన్ని అంగిట్లో వేసుకుని వెళ్ళిపోబోతున్నాను" అన్నారు.

"నోట్లో వేసుకోడానికిదేమైనా మిఠాయా? తల దువ్వి పూలు ముడిచి చుక్కపెడితే చూడ చక్కగా వుంటుందిగదా అని...."

వరలక్ష్మికి అడ్డుతగిలి "ఈ సింగారింపులు చేసుకుంటే నువ్వు చక్కగా వుండవూ" అన్నారు రంగనాథంగారు.

"నాకేముంది! ముసలిదాన్నయిపోతున్నాను"

"నువ్వెప్పుడూ ముసలిదానివికావు వరలక్ష్మీ!" రంగనాథంగారు భార్యను జాలిగాచూస్తూ అన్నారు.

"ఐతే యికనేం మావయ్యా! మారాజులా నువ్వు రెండో పెళ్ళి చేసుకోవచ్చునే!" అంది నాగరత్నం.

"ఎవరొద్దన్నారు. ఎవరో ఎందుకు? కావలిస్తే నాగరత్నాన్నే చేసుకోండి" అంది వరలక్ష్మి.

"అగాగు—ఎవరిని చేసుకోవచ్చో, ఎవరిని చేసుకోగూడదో నువ్వే చెప్పేస్తే ఎలాగు? నన్నూ ఆలోచించుకోనివ్వు" అని సిగరెట్టును పీల్చి పీల్చి ఆఖరుకు బారెడు పొడుగు ధూమమాలికను గాలిలోకి వదలిపెట్టారు రంగనాథంగారు.

ఈ సంఘటన జరిగిన తర్వాత వరలక్ష్మి కొంచెం యించుమించుగా మూడేళ్ళు మాత్రం బ్రతికింది. ఆమూడేళ్లలో ఆమె కనీసం నెలకు రెండుమూడుసార్లు నాగరత్నంతో అంతరంగికంగా "ఏమిటే, నాగరత్నం! నీయిష్టమేమిటో చెప్పనేలేదే మరి! నీకిష్టమైతే ఊఁ అను! ఆ శుభకార్యం కాస్తా జరిగిపోతే నాకెంతో హాయిగా వుంటుంది. ఎలాగు నాకు బిడ్డలులేకపోయారు. నీకడుపునైనా ఒక కాయగాస్తే..." అని అడుగుతూ వచ్చింది. నాగరత్నానికి ఏం చెప్పాలో తోచేదికాదు. అసలీమాటను అవునని,

కాదని తేల్చి చెప్పవలసిన మనిషి నాగరత్నం కాదు. ఆసంగతి వరలక్ష్మికి కూడా తెలుసు. కానీ ఎవరిదగ్గర ఈ ప్రసక్తి తేవాలో వారిదగ్గర మాత్రం వరలక్ష్మి నోరు పెగిలి, మాట బయటికి వచ్చేది కాదు.

పదిరోజులు జ్వరం కాసిందన్న నిందతో వరలక్ష్మి బొందెలో నుంచి వేరుపడి జీవుడు అనంతవాయువుల్లో కలిసిపోయాడు. గోదాన, భూదాన, హిరణ్యదానాది సత్కార్యాలతో అంత్య క్రియలు యథావిధిగా జరిగిపోయాయి. భార్యావియోగంవల్ల రంగనాథంగారు భిన్నులైపోయారని కూనలమ్మకోనలో జనం చెప్పుకున్నారు. భార్య చనిపోయిననాటినుంచీ ఉత్తరక్రియలు పరిసమాప్తికి వచ్చిన పదహారోనాటివరకూ రంగనాథంగారు గడ్డం గీసుకోని మాటనిజమే! ఆ పక్షంరోజుల్లో ఆయనకు దేశం నలుమూలలనుంచీ తండోపతండంగా సానుభూతి లేఖలు వచ్చాయి. అన్ని లేఖలూ ఒకేఒక విషయాన్ని వివిధభంగిమల్లో ఉద్ఘోషించాయి. "ఇది మీకు రాదగిన కష్టంగాదు. ఐనా దీనికి తట్టుకోగల మనస్సంయమనాన్ని భగవంతుడు మీకు ప్రసాదించగలడు. అవధుల్లేని మీ జీవనోత్సాహంలో పాలు పంచుకోడానికైనా మీకొక సహచారిణి అత్యవసరం. కానీ మీకు సహధర్మచారిణి లేని కొరత తాత్కాలికమేననీ త్వరలో అది తీరిపోగలదనీ భావిస్తున్నాము."

వరలక్ష్మి చనిపోయి రెండుమూడు నెలలు గడచిపోయిన తర్వాత నాగరత్నం ఓరోజు సాయంత్రం రంగనాథంగారిగదిని శుభ్ర పరచడానికి మేడమీదికి వెళ్ళింది. రంగనాథంగారు వాలుకుర్చీలో కూచుని ఏవో లెక్కలు చూచుకుంటున్నారు. ఎన్నికలసంరంభంలో ఒక మిత్రుడికి పలుకుదోడుగా వెళ్ళి నెలరోజుల తర్వాత ఆ నాటి ఉదయమే ఆయన యింటికి తిరిగివచ్చారు. నాగరత్నం తలవంచుకుని ధూళిరేగకుండా మెల్లగా గదిలో చెత్తవూడ్చివేస్తూ వాలుకుర్చీకి దగ్గరగా వచ్చింది. మీటనొక్కగానే యంత్రం పనిచేయడానికి ప్రారంభించినట్టు గదిలో అప్పుడొక హఠాత్సంఘటన జరిగింది. రంగనాథంగారు చేతినిచాచి నాగరత్నాన్ని తమవైపుకు లాగేశారు. ఆ విసురులో తోటకూరకాడలా అల్లల్లాడిపోతూ నాగరత్నం రంగనాథంగారిమీద కూలబడిపోయింది.

నాగరత్నానికి ఇది సరిక్రొత్త అనుభవం కాదు!

వరలక్ష్మి బ్రతికి వున్నరోజుల్లో నాలుగైదుసార్లు యిలాగే జరిగింది. మొదటిసారి నాగరత్నం మరీ కుర్రదానిలా రంగనాథంగారి చేతిని కొరికివేసి తుర్రున పారిపోయింది. ఈ మాట వరలక్ష్మితో చెబుదామనికూడా అనుకుంది. కానీ తను చెప్పడానికి జంకు గొంకులు పడుతుండగానే వరలక్ష్మి "ఏమిటే నాగరత్నం! మీ మావయ్య చేతిని అలా కొరికేశావు?" అని విస్మయంగా ప్రశ్నించింది. నాగరత్నం బిత్తరపోయింది. అయితే తను, రంగనాథంగారు దగ్గరికి లాక్కొని ఉక్కు చేతులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా ఊఁ ఆఁ అనకుండా ఊరికే వుండిపోవాలన్నమాట!

ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో యిదివరకూ తను ప్రతిఘటించినట్టే ఈసారి కూడా నాగరత్నం రంగనాథంగారి చేతుల్లోనుంచి జారి పోవడానికి ప్రయత్నిస్తూ "విడిచిపెట్టు మావయ్యా! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? నీకేం? నువు మగమహారాజువి. వచ్చేది నాకేగా" అంది.

రంగనాథంగారు నాగరత్నం అమాయకత్వానికి జాలిపడ్డట్టు మెల్లగా నవ్వేస్తూ "ఆడదానికి అన్యాయం చేయదలచుకుంటే ఎంతోసేపు పట్టదు. నా ఉద్దేశం అదికాదు." అని తన నిడుపాటి చేతులతో ఆమెను దగ్గరగా లాక్కొని హృదయాని హత్తుకుంటూ "అందులోనూ నీకా" అన్నారు.

విడివిడిగా చూచుకుంటే అర్థమేమిటో అంతుతేలని ఈ మూడు పొడివాక్యాలు నాగరత్నంపైన మూడు మంత్రాల్లాపని చేశాయి. ఆమె మంత్రముగ్ధయైపోయిన నాగకన్యలా ఆ పారవశ్యంలో రంగనాథంగారి చేతుల్లో ఆటబొమ్మగా మారిపోయింది.

ఈ ప్రణయ నాటకానికి నాంది ప్రస్తావన ఏ ప్రదేశాన జరిగిందో అక్కడే ఈనాడు నాగరత్నాన్ని వెక్కిరిస్తున్నట్టుగా కలకలలాడిపోతూ వివాహమహోత్సవ ఆహ్వానపత్రికలు గదంతటా గాలిలో తేలియాడుతున్నాయి!

ఎవరికి పెళ్ళి? ఎవరి వి పెళ్ళిపత్రికలు?

నాగరత్నానికి అనుమానమైతే యిరవైరోజులక్రిందటే కలిగింది. గ్లాసులు, కూజాలు, పూలకుండీలు, కంబళ్ళలాంటి వస్తుసామగ్రులూ, వంటసంబారాలూ కొల్లలుగావచ్చి యింట్లో పడుతున్నాయి. ఈ మధ్య ఎవరో పెద్దమనుషులు ఏడెనిమిది కార్లల్లో తరలిరావడం జోరుగా కొనసాగుతోంది. వాళ్ళు వచ్చినప్పుడల్లా యింటిముందర పందిళ్ళువేసి, కంబానికి కంబానికీ గ్యాసులైట్లుకట్టి, విందులుపెట్టి కొట్టి కోలాహలం చేయడం మామూలే! ఈసారి మరీ పెద్దమనిషి ఎవరో రాబోతున్నారేమో ననుకుంది నాగరత్నం. కానీ నిజం అదికాదు. ఈ యింట్లో పెళ్ళి జరుగబోతున్నదన్నవార్త మెల్లమెల్లగా నాగరత్నం చెవుల్లోపడింది. ఆ సన్నసన్నటివార్త రెండింతలై, నాలుగింతలై, ఎనిమిదింతలై అలా అలా ద్విగుణీకృతంగా ధ్వనించి నాగరత్నం బుర్రలో భూకంపాలు సృష్టించి, హృదయంలో అగ్నిపర్వతాల్ని ప్రేల్చింది.

పత్రికను చేతబట్టుకుని ద్వారబంధానికి ఆనుకుని నిల్చుంది నాగరత్నం. ఆమెకళ్ళు శూన్యంగా ఆకసంవైపు చూస్తున్నాయి. దూరాన కొండలపైన, వాటిమధ్య కోనలో, పైన ఆకాశాన, తలలో, మదిలో, ఎదలో కారుచీకటి కటికరక్కసి వికృత వికటాట్టహాసమే వినిపిస్తోంది, కనిపిస్తోంది నాగరత్నానికి! నేత్రాంచలాలకు చేసుకున్న కాటుకతో కలిసి, కన్నీరుగూడా నలుపెక్కి ఆమె బుగ్గలమీద జొటజొట కారుతోంది.

దగ్గరలో అడుగుల సవ్వడి వినిపించింది.

వస్తున్నవారు రంగనాథంగారు.

చేతిని దారికడ్డంగా చాపి పత్రికను రెపరెపలాడిస్తూ "ఏమిటిది" అని గర్జించింది నాగరత్నం.

ప్రశాంతమూ, నిస్పష్టమూ అయిన గంభీరస్వరంతో రంగనాథంగారు "తెలియడంలేదా నాగరత్నం! అది పెళ్లిపత్రిక" అన్నారు.

"ఎవరికి పెళ్లి ?"

"ఎవరికో అయితే పత్రికలు మనింట్లో ఎందుకుంటాయి!"

"మనింట్లో ఎవరికి పెళ్ళని అడుగుతున్నాను."

"నాకే! నాకు పెళ్ళయితే నీకయినట్టు కాదా నాగరత్నం!" రంగనాథం గారు లాలనగా అడిగారు.

"ఆ నోటితోనే నాకన్యాయం జరగదని చెప్పావు!"

"ఇప్పుడుమాత్రం నీకేం అన్యాయం జరిగింది నాగరత్నం! ఆడదాన్ని నమ్మించి ద్రోహంచేసే దుర్గుణం మాయింటా బయటా లేదు తెలుసా! మా తాతగారికి మూడు పెళ్లిళ్లు. ఐతే నేం! ఆ పెళ్లాలకన్నా ఆయన చేరదీసిన సాంచారమ్మకే రాజభోగం జరిగింది. ఇక మా నాన్నగారి సంగతి సరేసరి! ఆయన చుట్టపు చూపుగా ఎప్పుడో యింటికి వచ్చేవారంతే! మిగిలినప్పుడల్లా పట్నంలో ఆ కమలాబాయి యింట్లోనే వుండిపోయేవారు."

"భోగంవాళ్లతో నాకు పోలికేమిటి! డబ్బుకు మానం అమ్మకో దాని కెక్కడెవరూ కొచుక్కాబోలేదు." నాగరత్నానికి ఒళ్లు పొగలుబోతోంది. ఆ ఉద్వేగంలో ఆమెకళ్లు విస్ఫులింగాలై రంగనాథంగారిమీద నిప్పులుమిరాయి.

"కాస్త తమాయించుకో నాగరత్నం! నీకు తెలియదు. ఈ యింటికి రాబోతున్న క్రొత్తకోడలు ఏ కాస్తో కూస్తో చదువుకున్న పిల్ల. సినిమాలు షికార్లు, క్లబ్బులూ లేడీసోషలు లేకుంటే ఆవిడకొక్క రోజు గడవదు. ఆమె యిక్కడుండి సంసారం వెలగబెట్టబోతుందని గాదు. ఆమె తండ్రికొక్కతే కూతురు. ఆ తండ్రికి డబ్బుంది. ఏ పెట్టెలో వేసి రమ్మంటే ఆ పెట్టెలో ఓట్లువేసి రావడానికి సిద్ధంగా నాలుగైదువందల కుటుంబాలు అతడి చేతిలో వున్నాయి. కాలం ఒకరీతిగా వుండదు..."

"అవన్నీ నాకక్కర్లేదు"-తలపైన చావుదెబ్బ తగిలినా యింకా పడగెత్తడానికి ప్రయత్నించే కొదమత్రాచులా బుసలు కొడుతూ మాట్లాడుతోంది నాగరత్నం. "నా బొందిలో ఊపిరుండగా ఈ పెళ్ళి జరగదు. ఏమనుకుంటున్నావో, యిది నిప్పుతో చెలగాటం"

చేతిలోవున్న పత్రికను నలిపి నేలపైన కొట్టి మునిపంటితో పెదవిని కొరుక్కుని పొంగివస్తున్న దుఃఖాన్ని అపుకుంటూ, ఒక్క విసురున ద్వారాన్ని దాటి, అలంబనంలేని మల్లెతీగలా కంపించిపోతూ దాబాపైన నడిచి మేడమెట్లు దిగుతోంది నాగరత్నం. గసబోసుకుంటూ పరుగెత్తివస్తున్న నాగలింగం మెట్లపైన ఆమెను తారసిల్లాడు.

తమ్మున్ని చూడగానే నాగరత్నం కుప్పకూరలా నిల్చున్న మెట్టుపైన్నే కూలబడిపోయింది. కూచోడానికి సైతం ఓపరికంలేక, ఆమె తమ్ముడి కాళ్లవైపు వాలిపోయి వెక్కి వెక్కి ఏడుస్తూ "ఈ బ్రతుకు నేనెందుకు బ్రతకాలిరా తమ్ముడూ! ఇంతకంటే చస్తే మేలుగాదూ!" అంటూ వాపోయింది.

"ఏమిటక్కా నీ అగడం! అవతల కొంపలంటుకపోతున్నాయి. ఎవడో ముసలాడు నా కడ్డొచ్చి దుడ్డుకర్ర దెబ్బతిని దిక్కులేని చావు చావబోతున్నాడు. తప్పుకో. బాబుగార్ని చూడాలి." అన్నాడు నాగలింగం.

నాగరత్నం చివాలున లేచి నిల్చుని తమ్ముణ్ణి చురచుర చూస్తూ "ఎవరి దాగడం! నన్ను భోగంపడుచు క్రింద లెక్కగట్టిన మీ బాబుగారిది అగడం. నమ్మించి నా బ్రతుకును వట్టెట్లో కలుపుతున్న మీ అయ్యగారిది అగడం" అంటూ ఉక్రోషాన్ని వెళ్ళగ్రక్కింది.

"ఇప్పుడు నువ్వనేదేమిటక్కా?" అసలు విషయ మేమిటో అర్థంగాక విసుగ్గా ప్రశ్నించాడు నాగలింగం.

"ఒకమాట చెప్పి, ఆ మాటకు అప్పుడొకమాదిరి, యిప్పుడొక మాదిరి అర్థం చెబితే నేనేం చేయను! ఒరే తమ్ముడూ! నే నాడదాన్ని! ఆడదాన్ని వంచన చేయడానికింత పెద్ద ఎత్తు అవసరంలేదు. ఇప్పుడాయన వేరే పెళ్ళి చేసుకుంటే నా గతేంకావాలి! రేపు నలుగురూ నన్ను చూచి నాలుగు మాటలనుకుంటే నేను నా ముఖాన్ని ఎక్కడ దాచుకోను!"

నాగలింగం తోబుట్టువును ఎడంగా త్రోసి, పైమెట్టుమీదికి దాటుకుని క్రిందికి చూస్తూ అన్నాడు. "నీకు పిచ్చెక్కిం దేమిటి! మన అంతస్థేమిటి? బాబుగారి అంతస్థేమిటి? ఆయన నిన్ను పెళ్లాడట మేమిటి? ఎవరైనా వింటే నవ్వుతారు. పో అవతలికి!"

అవును! దాస్యభావం ఒక మనిషిని మేరువునుచేసి, సాటి మనిషిని ఆ మేరువు ఎదుట గుప్పెడు ధూళిగా మార్చివేస్తుంది.

* * * *

జవానుల్ని తన వెనువెంటనే సైకిళ్ళమీద బయల్దేరమని చెప్పి సబ్ యిన్స్పెక్టరు సత్యనారాయణ మోటార్ సైకిలు 'స్టార్టు' చేశాడు. పట్టు విడిపించుకుని తోడేలుమీదికి కవిసే జాగిలంలా రొప్పుతూ మోటార్ సైకిలు రోడ్డుపైకి వచ్చింది. సత్యనారాయణ సీటుపైన సర్దుకుని కూచున్నాడు. వింటినుంచి వెలువడ్డ బాణంలా చిమ్మచీకటిని చీల్చుకుని వెళిపోతోంది సైకిలు. సత్యనారాయణ యిప్పుడిప్పుడే చీకటిలో ప్రయాణాలకు అలవాటుపడుతున్న మనిషి. పట్టపరీక్షలో అగ్రశ్రేణిలో ఉత్తీర్ణుడై, ట్రెయినింగు సెంటరులో ప్రతిభలోనే గాక, ప్రవర్తనలో గూడా మంచి పేరు తెచ్చుకున్న సత్యనారాయణను ఏరి కోరి పై ఉద్యోగులు కూనలమ్మ కోనకు రవాణా చేశారు. ఒక్క వేడినిట్టూర్పుతో ఉద్యోగ భారాన్ని తన భుజస్కంధాలపైన్నుంచి దించివేసుకుంటున్న ముసలి సబ్-ఇన్స్పెక్టరు సత్యనారాయణ భుజంపైన చేయివేసి "అబ్బాయీ! ఇంక నువ్విక్కడ ఉద్యోగం చేయబోతున్నావు నాయనా" అన్నాడు.

ఛార్జీ పుచ్చుకున్నట్టు సంతకం చేయబోతున్న సత్యనారాయణ 'షాక్' తిన్నవాడిలా కలం టేబిలుపైన వుంచి "మీరు పెద్దవారు. నేను కుర్రవాణ్ణి. మీరు చెప్పదలచుకున్నదంతా స్పష్టంగా చెప్పి వేయండి" అన్నాడు.

ఉద్యోగ జీవితంలో తను నేర్చుకున్న గుణపాఠాల సారాంశాన్నంతా ఆ తలనెరసిన ఉద్యోగి నాలుగోతరగతి కుర్రాడికి పాఠం బోధించవలసిన తరహాలో ప్రశ్నోత్తరాలుగా వివరంచేసేవాడు.

"ఒకచోట నేరం జరుగుతుంది. ఆ నేరం జరగడానికి మనిషిని ప్రేరేపించేది ఏమో నీకు తెలుసుననుకుంటాను."

సత్యనారాయణ తేలిగ్గా బదులు చెప్పివేశాడు.

"ఒకటి అజ్ఞానం. రెండోది అహంభావం. సాధారణంగా వీటివల్ల నేరాలు సంభవిస్తుంటాయి."

"రైట్—టిలో మొదటిరకం నేరాలతో మనకు చిక్కు లేదు. ఏ అజ్ఞానంవల్లనైతే నేరం జరుగుతుందో, అదే అజ్ఞానంవల్ల మనకు నేరస్థుడు దొరికిపోతాడు. తికమకలు పడకుండా న్యాయస్థానం అతడికి శిక్ష విధించగలుగుతుంది. కానీ రెండోరకం నేరస్థులకి వాళ్ళని నువ్వేం చెయ్యగలవు!"

దక్కా మొక్కీలు తిన్న ఆ పాత ఉద్యోగిని యిక్కడ సత్యనారాయణ పోల్తాకొట్టించడానికి ప్రయత్నించాడు.

"అజ్ఞానమూ, అహంభావమూ పరస్పరాశ్రయాలు. నేరాలకు మూలకారణాలయిన వాటితో మనకు ప్రసక్తి లేదు. మనకు కావలసిందల్లా నేరస్థులు."

"కానీ ఈ రెండోరకం నేరస్థులు అంత అక్రమంగా నీ పిడికిట చిక్కిపోరు. వాళ్ళకు డబ్బుంటుంది. దర్పముంటుంది. వాళ్ళని అజ్ఞానులక్రింద లెక్కగట్టడానికి వీల్లేదు. పైగా వాళ్ళు తనచుట్టూతా వున్న అజ్ఞానాన్ని కోటగా మలుచుకుని, ఆ కోట నడుమ ఏకచ్ఛత్రాధిపత్యం సాగిస్తారు. వాళ్లు నేరం చేస్తున్నారని ఋజువుచేయడానికి ప్రత్యేకంగా సి. ఐ. డి. ఉద్యోగులు అవసరం లేదు. ఆ నేరమేదో ముంజేతికంకణంలా తెలిసిపోతూనే ఉంటుంది. కానీ మనం వాళ్ళ నేమీ చేయలేము."

ధర్మయుద్ధానికి పోహారిస్తున్న వీరయువకుడిలా హుంకరించి సత్యనారాయణ "నా ఉద్యోగధర్మం ఎదుట ధనాన్నీ దర్పాన్నీ తృణంగా పరిగణిస్తాను" అన్నాడు.

ముసలి ఇన్‌స్పెక్టరు మెల్లగా నవ్వి నిస్పృహతో "అది నీ ఉద్యోగధర్మానికి వెనుకబలం వుంటే అప్పటిమాట" అన్నాడు.

"ధర్మం స్వయంశక్తివంతమయింది. దానికి వెనుకబలాలు, ప్రక్కబలాలు అనవసరం," సునిశ్చితమయిన ధర్మసూత్రాన్ని వల్లించాడు సత్యనారాయణ.

"ధర్మం స్వయంశక్తివంతమయిందే! కాదనను. కానీ విజయాన్ని సాధించడానికి ముందు ధర్మం ఎన్నోసార్లు అధర్మంతో ఘర్షించి ఓడిపోతుంటుంది. చిట్టచివరికయినా ఈ ధర్మం జయించడానికి కారణం ఒక అలౌకికమయిన మహాశక్తి దానికి బాసటగా నిలిచివుండడమేనని మనం విశ్వసిస్తాం. కానీ అనేకమారులు ధర్మాన్ని ఓడించగలుగుతున్న అధర్మానికి అండగా వుంటున్నవేవి? ధనమూ, దర్పమూ, బలమూ, ఛలమూ అని నేనంటున్నాను. వీటిని నువ్వు తృణప్రాయంగా పరిగణిస్తావు. కానీ నీ ధర్మానికి వెనుకబలంగా వుండటానికి ఉద్దేశింపబడిన లౌకికవ్యవస్థలు కొన్ని నీ ప్రక్కలోనే బల్లాలై ఆ అధర్మాన్ని చూచీచూడనట్టు మూకీభావం వహించినప్పుడు ధర్మం అధర్మం ముందు తలవంచుకోవలసివస్తుంది. నీకు తెలియదు బాబూ! ఈ ధర్మాధర్మసంఘర్షణలో నా తల బట్టగట్టిపోయింది. పోనీలే! నీకు పిరికిమందు పోయడం నా అభిమతం కాదు. నీ ఆదర్శాలతో నువ్వు పురోగమించు. కానీ అయిదేళ్ళ తర్వాత నీ ఉద్యోగానుభవాల్ని గురించి నాకో కార్డుముక్కమాత్రం వ్రాయి. సంతోషిస్తాను" అంటూ రిటయిర్డు సబ్‌యిన్‌స్పెక్టరు సత్యనారాయణదగ్గరనుంచి సెలవు తీసుకున్నాడు.

పోలీసుస్టేషను ఆవరణలో కాలుబెట్టిన నెలరోజులకు సత్యనారాయణ ఓ విచిత్రవృత్తాంతాన్ని గురించి తెలుసుకోవడం సంభవించింది.

ఆ రోజు యిరవైతొమ్మిదో తేదీ. మరునాటి సాయంకాలానికి నెలసరి లెక్కలన్నీ పూర్తికావలిసివున్నాయి. సత్యనారాయణ రికార్డును తనిఖీ చేస్తున్నవాడు, ఉన్నట్టుండి తలపైకెత్తి వరండాలో పచారు చేస్తున్న హెడ్‌కానిస్టేబిలును పిలిచి "ఆది కాదు వరదయ్యా! ఈ లోకాలిటీలో దొంగసారా కేసులు ఎక్కువన్నారు. ఏదీ మరి! ఈ నెలకంతా ఒక ప్రొహిబిషను కేసయినా రిజిష్టరులో నమోదు కాలేదే!" అన్నాడు.

ఆ దేమంత ఘనకార్యమన్నట్టు వరదయ్య నాలుక చప్పరించి "దానికేమండీ! మీరు కావాలంటే రేపటికి తీసుకొస్తాను" అన్నాడు.

"కావాలనుకోవడమేమిటి! ఈ నెలరోజుల పొడుగునా ప్రొహిబిషను కేసు ఒకటయినా లేకపోతే ఈ ఏశైయేసులో దేశంలో మనం ఉన్నామా, ఊడామా అని పైవాళ్ళకి సందేహంరాదూ!" అన్నాడు సత్యనారాయణ.

వరదయ్య మరునాటి మధ్యాహ్నానికల్లా అన్నంతపనీ చేశాడు.

తుమ్మ సారాయితో నిండిన కడవను తలపై కెత్తుకుని ఒళ్లంతా చెమట గార్చుకుంటూ హెడ్ కానిస్టేబిలు వెంబడే స్టేషనులో ప్రవేశించిన ఆ నేరస్థుణ్ణి, చూడనూ చూడనూ సత్యనారాయణలో జాలి, విస్మయం, కోపం ముప్పిరి వేసుకపోయాయి.

ఆ వచ్చినవాడు మొలకు మాడుమూళ్ళ తుండుగుడ్డ చుట్టుకున్నాడు. అతడేవాడైనా తిండిముఖం కళ్ళజూచి ఎరుగునో, ఎరుగడో సత్యనారాయణకి తెలియదు. కానీ అతడి కడుపు వీపుకు అంటుకపోయివున్నమాటమాత్రం నిజం! రొమ్ముల్లో ఎముకలు మాత్రం కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి. దొంగసారా కాయడానికి కావలసినంత గుండెదిటవున్న మనిషి యిలా వుంటాడని సత్యనారాయణ ఎన్నడూ అనుకోలేదు. తన ఉద్దేశం ప్రకారం మెలి దిరిగిన మీసాలతో, కండపుష్టితో మిసమిసలాడిపోతున్న దేహంతో పోషించిన పొట్టేలులా వుండవలసిన దొంగసారా నేరస్థుడు ఈ శిథిల రూపంతో ప్రత్యక్షమైనందుకు సత్యనారాయణ ఆశ్చర్యపడిపోయాడు.

'అబ్బీ' అనాలో 'అయ్యా' అనాలో తోచక కాసేపు తటపటాయించి చివరకు సత్యనారాయణ సంబోధన ఏదీ లేకనే "ఇంతకు ముందెప్పుడైనా జైలుకు వెళ్ళొచ్చావా?" అన్నాడు.

"వెళ్ళకేంబాబూ! పాతకాపునే!" అనాక సర్వసామాన్యమైన విషయంలా జవాబిచ్చాడు నేరస్థుడు.

మళ్ళీ ఒకసారి అక్కడికి వెళ్ళి రావలసినపని తగిలిందన్న భావం ఆ జవాబులో ధ్వనించి వుండకపోతే సత్యనారాయణ ఆ బికారివాడిమీద మరికొంతసేపు ప్రశ్నలవర్షం కురిపించి వుండే వాడే! కానీ అదంతా అనవసరమని అపరాధి ఒక్కమాటలో తేల్చే శాడు. భద్రాద్రిరఘురాముని దర్శనంకోసం వెళ్తుండగా బంధు మిత్రుల ఆజ్ఞ ఎందుకని ప్రశ్నించే రామభక్తుడిలా, తనకూ జైలు గోడలకూమధ్య నిలిచివున్న ఈ పోలీసుల్ని, న్యాయస్థానాన్ని కంటగించుకుంటున్న ఆ నేరస్థుణ్ని సత్యనారాయణ ఏమని ప్రశ్ని స్తాడు!

ఆ రోజురాత్రి వెన్నెల్లో అరుబయట కుర్చీలో కూర్చుని సత్యనారాయణ ఆ అపరాధి వింతమనస్తత్వాన్నిగురించే ఆలోచిస్తున్నాడు.

ఎదురింటి పంతులుగారు భోజనానంతరం నశ్యం వేసుకుంటూ వీథిలోకి వచ్చి 'ఏమండీ సత్యనారాయణగారూ! వెన్నెల్లో చల్లగా కూచున్నారే!' అంటూ పలకరించారు.

"రండి రండి! మీ కోసమే ఎదురుచూస్తున్నాను" అన్నాడు సత్యనారాయణ.

పంతులుగారు పిల్లలకు పాఠాలు చెప్పడం మాత్రమే గాక నెలరోజులుగా సత్యనారాయణకు రాత్రిపూట స్థానికపరిస్థితుల పైన ట్యూషను కూడా చెబుతున్నారు!

పంతులుగారువచ్చి కూర్చోగానే సత్యనారాయణ తన కుర్చీని ఆయన దగ్గరకు జరుపుకుని "యిక్కడంతా అయోమయంగా వుందండీ పంతులుగారూ! నిన్న మధ్యాహ్నం ప్రొహిబిషను కేసులు లేవేమని వరదయ్య నడిగాను. అతడీరోజు మధ్యాహ్నానికే ఓ కేసు తీసుకొచ్చేశాడు. కానీ మనిషిని చూస్తుంటే అతడు నేరం చేసిన వాడిలా కనిపించడంలేదు'' అన్నాడు.

పంతులుగారు రెండు మూడుసార్లు తల పైకెత్తి అంతలోనే దించేసుకుని "ఊఁ, ఎన్నో వుంటాయి. అన్నీ కాలక్రమాన మీకే తెలిసొస్తాయి" అన్నారు.

'ఫరవాలేదు చెప్పండి బాబూ దంపశ' ప్రాధేయపడ్డాడు సత్యనారాయణ!

'కోనలో సారాయి కాచడమూ, అమ్మడమూ అదొక బహిరంగవ్యాపారమండీ సత్యనారాయణగారూ!' పంతులుగారు మళ్లీ ముక్కులకు నశ్యం దట్టిస్తూ అంటున్నారు. "ఊరూరికీ ఒకటి రెండుబట్టీలుంటాయి. త్రాగే వాళ్లు అక్కడికివచ్చి యథేచ్ఛగా త్రాగి వెళ్ళిపోతుంటారు. వసూలైన డబ్బులో కొంత ఉత్పత్తి దారుడికి, కొంత ఈ చిల్లరదుకాణాలపైన ఈగవాలకుండా చూచుకునే ఆసామీకి, కొంత మరి కొందరికీ అలా అలా వాటాలుగా ముట్టిపోతుంది. మరి సింహానికి ఆహారంగా రోజు కొక జంతువు అవసరం గదండీ! మీకు ప్రొహిబిషను కేసులో గిరాకీ తగిలినప్పుడు వాళ్లే కలిసి కట్టుగా మీ కొకణ్ణి పంపకం చేసే స్తుంటారు. ఏముంది! ద్వీపాంతరం కాదుగదా! ఏ నాలుగైదు నెలలో! ఉండిరానీ"

సత్యనారాయణ బుర్ర గిర్రున తిరిగిపోయింది. అతను తరా లున్న టేబుల్లోనుంచి డైరీ పైకితీసి "ఆ ఆసాము లెవరో నేను తెలుసు కోవాలి చెప్పండి. చెప్పండి" అన్నాడు.

కానీ చిక్కు విక్కరించడంకంటే పారిపోయి వెక్కిరించడం మంచిదని పంతులుగారికి బాగా తెలుసు.

"బాబ్బాబూ! ఆ సంగతి నన్నడక్కండి. నాకు తెలియదు. మీ పోలీసు వాళ్ళకీ, మా టీచర్లకీ ఏడేడు జన్మాలుగా సంబంధాలు లేవు. ఇప్పుడు క్రొత్తగా కలుపుకుంటే వ్యవహారం ఎటుపోయి ఎటు వస్తుందో చెప్పడం కష్టం."

ఐతే సత్యనారాయణ ఆ ఆసామి లెవరో తెలుసుకునేంత వరకూ ఒంటికాలు పైన నిలిచాడు. మొదట కొంచెం పస్తాయించినా తర్వాత తర్వాత హెడ్కానిస్టేబిలు వరదయ్యకు చెప్పక తప్పింది కాదు.

పై సంఘటన జరిగి మళ్ళీ ఒక నెలరోజులు గడచిపోయిన తర్వాత ఓ రోజు రాత్రి యింటిలోపల పడుకుని నిద్రపోతున్న సత్యనారాయణ ఉలికిపడిలేచి కూర్చున్నాడు. తలుపు పైన మెల్లగా చప్పుడౌతోంది. సత్యనారాయణ గబగబా వెళ్ళి తలుపుతీశాడు. అది అమావస్యనిశి. కన్ను పొడుచుకున్నా ఎదుటి వస్తువు కనిపించడం లేదు. ఆ చీకట్లో మెట్లపైనుంచి ఒక మనిషి "కొంచెం తప్పుకోండి బాబూ! దీన్ని లోపల వేస్తాను" అన్నాడు.

"ఏమిటది?" అని ప్రశ్నించాడు సత్యనారాయణ.

"బియ్యం బస్తా బాబూ! కిచ్చిలిసంబావు బియ్యమండీ! ముక్కులు కుట్టుకోవచ్చు"

ఎంతో నిగ్రహంమీద అడిగాడు సత్యనారాయణ.

"ఎవరు పంపించారు?"

పంపించినవారి పేరు చెప్పి ఎదుటవున్న మనిషి "ఇదే కాదండీ! ఇంకా బండ్లో ఓ నెయ్యిడబ్బా, ఓ కందిపప్పు మూటా ఇదిగాక ఓబుట్టెడు మల్గూబా మామిడిపళ్లు..." అంటూ జాబితా చెప్పుకుపోసాగాడు.

సత్యనారాయణ అతడి మాటలకు అడ్డు తగిలి, టార్చిలైటు తెమ్మని భార్యను కేక వేశాడు. మీటనొక్కి వెలుగును వీధిలోకి ప్రసరింపజేస్తూ "ఇదిగో, ఈఆటలిక్కడ సాగవు. ఇంకోసారి ఎవరైనా యిలాచేస్తే నడివీథిలో నిలబెట్టి లాఠీతో బాదిస్తాను. పో, వెళ్ళిపో" అంటూ దభాలున తలుపువేసి గడియవేసుకున్నాడు.

"అయ్యయ్యో, అదేమిటండీ అలా అరిచారు! వెళ్ళి వాడేం చేస్తాడో, ఏంపాడో!" అంటూ గడగడలాడిపోయింది సత్యనారాయణ భార్య.

"నీకేం భయంలేదులే, నువ్వెళ్ళి పడుకో" అని సత్యనారాయణ డ్రాయర్లోనుంచి డైరీపైకి తీసి యింతకుమునుపే తను వ్రాసి వుంచుకున్న పేరు క్రింద ఎర్రసిరాతో చక్కగా ఓగీత గీశాడు.

ఆ తర్వాత ఎర్రసిరాతో 'అండర్లైను' చేసిన ఆ పేరు కెదురుగా మరికొన్ని యింటూ మార్కులు వేసుకోవలసిన అవసరాలు కూడా వచ్చాయి. ఓరాత్రివేళ దొంగలు దోచుకున్న లారీ ఒకటి

సత్యనారాయణ నోరు చించుకుంటున్నా వినిపించుకోక ట్రంకు రోడ్డుపైన సాగిపోయింది. పాపం సైకిలు లేకపోవడంచేత సత్యనారాయణ కొంతదూరం పరుగెత్తి కూడా చూశాడు. కానీ నెంబరు కనిపించలేదు.

తర్వాత వాకబుచేయగా తెలిసింది, కోనలో ఓ మారుమూల వున్న చెట్లన్నీ నరికివేయబడుతున్నాయనీ, మాటులో కొల్లలైపోతున్నాయనీ!

"ఈ పని ఎంతకాలంనుంచీ జరుగుతోంది?" అన్నాడు సత్యనారాయణ.

"ఇది మామూలుగా జరుగుతూన్న పనండీ" అన్నాడు వరదయ్య.

"ఐతే ఉద్యోగులు ఏంచేస్తున్నట్టు?"

"ఉద్యోగులు ఏం చేస్తారు? ముందట పట్టాచేలలో స్వంత చెట్లు నాలుగైదు నరికివేస్తారు. తర్వాత వీలైనప్పుడు రిజర్వులో చెట్లు కూలకోస్తారు. అన్నిటినీ తుండ్లుగాచేసి తమ జాగాలో ఎక్కడో మాటువేసుకుంటారు. ఇక రవాణా సంగతి మీరే చూశారు. రాత్రికి రాత్రే మనం ఒకవేళ చూచి కేకలు వేసినా 'కేర్' చేయకుండా లారీ వెళ్ళిపోతుంది.

సత్యనారాయణ పిడికిలిమూసి, నుదురు చిట్లించుకుంటూ "నాకూ అవకాశం వస్తుంది. తప్పకుండా వస్తుంది" అనుకున్నాడు.

ఈ నాటికి అవకాశం వచ్చింది.

"పిలుపొచ్చిందోయ్ వరదయ్యా! ఎవరో ముసలాడుట! వాళ్ళెవరో తలచితక బాదేశారట! తక్షణం రమ్మని కబురు. 606 ని 414 ని సైకిళ్ళు తీసుకుని వెంటచేరమ్మని చెప్పు" అంటూ బయలుదేరాడు సత్యనారాయణ.

వరదయ్యగుండె లోలోతులలోనుంచీ పొంగి, భయం ఉప్పెనలా అతడి పెదవులదాకా వచ్చింది. అతడేదో చెప్పడానికి నోరు తెరువబోయాడు. కానీ అప్పటికే సత్యనారాయణ సైకిలు దూరంగా వెళ్ళిపోయింది.

సత్యనారాయణ మహీడీముందు సైకిలు దిగేసరికి తొమ్మిదిన్నరయింది. ప్రాకారపుద్వారానికి ఈవల నీముభాగిచెట్ల నడుమ తెరచిన కిటికీలగుండా బయటికి వస్తున్న వెలుగులో మధ్య మధ్య చీకటితో ఆ మేడ సత్యనారాయణకు నీటిరంగుల చిత్రంలా కనిపించింది. వరాండాలో దీపం వెలుగుతోంది. దీపంచుట్టూ కూర్చుని త్రాళ్లు పేనుకుంటున్న పాలేళ్లు ఇన్స్పెక్టరును చూడగానే లేచి నిల్చున్నారు. వరాండాలో ఓవైపుగా స్పృహతప్పి పడివున్న ముసలివాడిని చూస్తూ కాసేపు సత్యనారాయణ మంచం దగ్గర నిల్చున్నాడు.

చిందరవందరగా వ్రేలాడుతున్న జుత్తునూ, దాదాపు ముఖాన్నంతా ఆచ్ఛాదించివేస్తున్న ఆ జేబుగడ్డాన్ని చూస్తుంటే ఆ ముసలివాడు ద్వీపాంతరప్రవాసంనుంచీ తప్పించుకుని వచ్చిన యావజ్జీవ ఖైదీలా కనిపిస్తున్నాడు. గాయంమీద తలపైనుంచి గడ్డంక్రిందికి బిగించి కట్టినకట్టు పూర్తిగా రక్తారుణమైపోయి వుంది. బట్టలపైన అక్కడక్కడా నెత్తురుమరకలు కనిపిస్తున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాల తాకిడికి రొమ్ము ఊపిరితిత్తిలా పైకీ క్రిందికీ ఊగిపోతోంది.

"బాబుగారూ!"

పిలుపు విని సత్యనారాయణ అటువైపు తిరిగాడు.

"అయ్యగారు మిమ్మల్ని భోజనానికి రమ్మంటున్నారు" అన్నాడు నాగలింగం.

"భోజనం అయినతర్వాతనే యింటిదగ్గరనుంచీ బయల్దేరాను. నా కిప్పుడు కేసునుగురించిన వివరాలు కావాలి."

"వివరాలేమున్నాయి బాబూ! నాకుతగలాల్సిన దెబ్బ ఈ ముసలాడికి తగిలింది; ప్రాణానికిపోతే పాపం రావడముంటే యిదేగదండీ మరి!"

"ఇంతకూ ఈ ముసలాడెవరో చెప్పావుకావు!"

"నేనుమాత్రం ఏమెరుగుదును బాబూ! తోటదగ్గర నేను మేకలు తోలుకునివుండగా బస్సుదిగాడు. అతడి వాలకాన్ని చూచి 'ఈ బస్సింకా యిరవైమయిళ్ళు పోతుంది. ఏదో ముల్లె దాచిపెట్టిపోయినట్టు యిక్కడెందుకు దిగేశావన్నాను. అతగాడిక్కడ ముల్లె దాచిపెట్టిపోయినమాట నిజమేనన్నాడు. నేను పిచ్చివాడేమో ననుకున్నాను."

సత్యనారాయణ తలపంకిస్తూ "తర్వాత" అన్నాడు.

"నాపేరడిగాడు. చెప్పాను. తర్వాత లేనిపోని వివరాలన్నీ అడిగాడు. కొన్నిటికి చెప్పాను. కొన్నిటికి నీకెందుకు, ఊరుకోమన్నాను. ఇద్దరమూ మాట్లాడుకుంటూ ఊళ్ళోకి వస్తున్నాం. డొంకలో వెంగలిపొదల్లోనుంచి వాళ్లు నాపైకి దూకారు."

"నిష్కారణంగానన్నమాట?"

"కారణమేంది! లేదంటే మేకలకోసం వేపచెట్లో నాలుక్కొమ్మలు నరికాను. వచ్చింది వచ్చిందే నాపైన దుడ్డుకర్రలు విసిరారు. నాలుగైదు దెబ్బలే అయినా నాకూ బాగానే తగిలాయి. ఇంతలో ఈ ముసలాడు 'కొట్టకండి, కొట్టకండి పుర్రాదువస్తాడు' అంటూ నా కడ్డొచ్చాడు. ఒకదెబ్బ అతడితలకు సరిగా తగిలింది. అంతే! చిల్లున నెత్తురు పైకెగిరింది. నెత్తురు కనబడగానే ఎక్కడివాళ్ళక్కడ పరుగు లంకించుకున్నారు."

"అప్పటికింకా బాగా చీకటి పడలేదుకదూ" అడిగాడు సత్యనారాయణ.

"లేదు బాబూ! ప్రొద్దుగూట్లోపడింది. మేకల్ని యింటికి తోలుకొస్తున్నాను. ఒకడివెనుకొకడుగా నా పైకొచ్చారు. కోనేటి రంగడు, నడబావి శ్రీరాములు, నూకాలు..."

"ఉండుండు" అని సత్యనారాయణ, సైకిల్ను గోడకానించి వరాండాలోకి వస్తున్న పోలీసుల్ని చూస్తూ" ఆ పేర్లు కాగితంలో వ్రాసుకోండి. ఎక్కడున్నాసరే, రాత్రికే వాళ్ళనిక్కడ హాజరు పరచాలి" అన్నాడు.

"ఎక్కడో ఎందుకుంటారండీ! వాళ్ళది ఈ వూరే. అదీ గాక పోలీసువాళ్ళంటే భయపడేరకమేమన్నానా! నిక్షేపంగా యింట్లోనే వుంటారు" అన్నాడు నాగలింగం.

పోలీసులు పేర్లు వ్రాసుకుని ఊరిపైకి వెళ్లిపోయిన తర్వాత సత్యనారాయణ ఒంటరిగా వరండాలో కూర్చున్నాడు. నిమిషాలూ, గడియలూ మెల్లమెల్లగా గడిచిపోతున్నాయి. ఇంత మేడలో ఎందరున్నారో ఏమోగానీ లోపలినుంచే చీమచిటుక్కుమన్నంత అలికిడైనా వినిపించడం లేదు. సత్యనారాయణ వాలు కుర్చీలో పడుకుని ఆపసోపాలు పడ్డాడు. ఆవులించాడు. కడకు పైకి లేచి కాలుగాలినపిల్లిలా అటూయిటూ పచారు చేయసాగాడు.

గంట దగ్గరదగ్గర పదిన్నర కావస్తోంది.

వృథాగా కాలం గడచిపోతున్నందుకు నిరుత్సాహపడుతూ సత్యనారాయణ మళ్ళీ మంచందగ్గరకు వెళ్ళి ముసలివాడికేసి చూశాడు.

ముసలివాడీసారి కళ్ళు తెరచుకుని పైకప్పుకేసి చూస్తున్నాడు.

“బాధగావుందా?” మంచంపైకి వంగి ప్రశ్నించాడు సత్యనారాయణ.

అవునన్నట్టు ముసలివాడు కళ్ళతోనే సంజ్ఞచేశాడు.

“కదలకుండా పడుకో! కదిలితే కట్టు తెగిపోవచ్చు.”

సమీపంలో బూట్ల టకటకలు వినిపించి సత్యనారాయణ తల పైకెత్తాడు. ముఖంలో విజయగర్వం తాండవిస్తుండగా పోలీసులు నేరస్థుల్ని వెంటబెట్టుకుని వచ్చేస్తున్నారు. సత్యనారాయణ ఆ అయిదుగురినీ వరండాలోకి వచ్చి వృద్ధుడి చూపు కానేటట్టు మంచానికి దగ్గరగా నిల్చోపుతున్నాడు.

ముసలివాడు వరుసగా, ఆ అయిదుగురి ముఖాల్నీ చూశాడు. కానీ అతడి ముఖంలో సత్యనారాయణ ఆశించిన మార్పేదీ ద్యోతకం కాలేదు. అతడు పైకప్పును, తనను ఎంత నిర్వికారంగానైతే చూశాడో, అంత నిర్వికారంగానే ఆ ఐదుగురినీ చూస్తున్నాడు.

“వీళ్ళెవరో ఎరుగుదువా?” సత్యనారాయణ దగ్గరగా ప్రశ్నించాడు.

నోరు మెదల్చడానికి వీల్లేకుండా కట్టు బిగిసివుండడంవల్ల ముసలివాడు మళ్ళీ సైగతోనే జవాబు సూచించవలసివచ్చింది.

అతడు పెదవి విరిచి చేతిని కదుపుతూ వీళ్లెవరో తనకు తెలియదని సంజ్ఞ చేశాడు.

సత్యనారాయణ విస్మయచకితుడైపోయి మరింత దగ్గరగా “వీళ్లలో నిన్ను కొట్టిందెవరు?” అని అడిగాడు.

ఎవరూ కాదన్నట్టు వృద్ధుడు మళ్లీ పెదవి విరిచి బాధగా వున్నా లెక్కచేయకుండా తల అడ్డంగా ఊపాడు.

ఇంతసేపటికి సింహద్వారం కిర్రుమని తెరచుకుంది. “ఏమిటండీ యిన్స్పెక్టరుగారూ! అప్పుడే విచారణ ప్రారంభించేసినట్టున్నారే”అంటూ రంగనాథంగారు నాగలింగం వెంబడించగా బయటికి వచ్చారు.

సత్యనారాయణ చిరపరిచితునితో మాట్లాడుతున్నట్టు తల పైకెత్తకనే “మీరొస్తేనే గానీ ఈ విచారణ ముందుకు సాగేట్టు లేదు” అన్నాడు.

“ఏం! ఎందుకని?” రంగనాథంగారు కుతూహలం వ్యక్తం చేస్తూ అడిగారు.

“ఈ ముసలివాడు వీళ్లెవరో తనకు తెలియదంటున్నాడు.”

“ఈసారి అడగండి” అన్నారు రంగనాథంగారు.

సత్యనారాయణ నెంబరు414 వైపు చూశాడు. 414 మంచాన్ని సమీపించి బాగా వంగి ముసలివాడి చెవిలో “నిన్ను బాదబాదినవారెవరో చూపించు” అన్నాడు.

ఇంతకుమునుపు సత్యనారాయణ ఆశించిన మార్పు ఒక్కుమ్మడిగా ముసలివాడి ముఖంలో అలముకుంది. కోపాన్నీ, అసహ్యాన్నీ వెలిగ్రక్కుతున్న చూపులతో అతడు కంపించిపోతున్న చేతిని గాఢ ప్రయత్నంతో పైకెత్తి చూపుడువ్రేలితో రంగనాథంగారిని నిర్దేశించాడు.

పోలీసులు నోరు తెరిచేశారు. నాగలింగం “ఏమి టేమి”టని కంగారుపడ్డాడు. రంగనాథంగారు అప్పుడే ముట్టించిన సిగరెట్టును నలిపి దూరంగా పారవేసి చరచరా మంచందగ్గరికివచ్చి నిల్చున్నారు.

రెండు నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి.

పరీక్ష ముగించుకుని రంగనాథంగారు సింహద్వారంవైపు వెళ్తూ “నాగలింగం! ఇన్స్పెక్టరుగారిని మేడపైకి తీసుకరా. నెమ్మదిగా మాట్లాడుకోవచ్చు” అన్నారు.

* * * *

సత్యనారాయణ మేడపైన రంగనాథంగారి గదిలో ప్రవేశిస్తున్నాడు, గోడగడియారం టంగుటంగున పదకొండుసార్లు మ్రోగింది. పాతికాలపు నగిషీపనుల పల్లటి కుర్చీలో కూర్చున్న సత్యనారాయణ రెండు మూడు నిమిషాలవరకూ ఆ గదిలోని వాతావరణంలో ఉక్కిరిబిక్కిరైపోయాడు. గోడలకు అక్కడక్కడా పులిచర్మాలు వేలాడుతున్నాయి. ద్వారబంధంపైన, నిలువెత్తు తైలవర్ణచిత్రాలపైన వంపులు తిరిగిచివరల్లో ఈటెలా మొనదేలివున్న దుప్పికొమ్ములు గోడకు తాపడం చేయబడివున్నాయి. జోడుబారుల తుపాకీ ఒకటి బడలిక తీర్చుకుంటూ బీరువాపైన విశ్రమించి వుంది. కిటికీ లన్నీ మూసివుండడం చేత గదిలో గాలి కదలడం లేదు.

ఆ నీరవ నిశ్శబ్దంలో మొట్టమొదట రంగనాథంగారే నోరు తెరిచారు.

“ఇన్స్పెక్టరుగారూ! ఈ లోకంతీరుచూస్తుంటే ఒక్కొక్కప్పుడు నాకు నవ్వొస్తుంటుంది. మీకు?” చిరునవ్వుతో ఆయన మెల్లగా ప్రారంభించారు.

“నాకు ఏడుపొస్తుంది.” దాదాపు రెండుగంటలసేపటినుంచీ సత్యనారాయణ ఉద్విగ్న హృదయంలో రేగుతున్న కల్లోలం మాటల తొడుగుతో పైకి పెల్లుబికింది. “ఎందుకనండి!” “లోకం ఒక నాటకరంగమే కావచ్చు. కానీ ఈ నాటకరంగానికి యింతటి కృత్రిమమైన కథావస్తువుమాత్రం ఎన్నడూ ఎన్నుకోబడలేదు. అన్యాయమనే బెబ్బులి మేకతోలు కప్పుకుని రంగంమీద పరవళ్ళు త్రొక్కుతుంటే, వెనుకవైపునుంచి సామాన్య మానవుడు “ఆపండి. తెర దించండి” అని ఒకవైపు మొత్తుకుంటూన్నా, సభలో ముందువైపు సుఖాసనాల్లో కూర్చున్నవాళ్లుమాత్రం “అద్భుతం, అమోఘం” అని నాటకాన్ని మెచ్చుకుంటున్నారు. నాటకంలో అన్నీ నియమ

బద్ధంగా జరిగిపోవటానికనీ, అల్లరి జరక్కుండా ఉండటానికనీ నియమించబడుతున్న సిబ్బందికి ఇంతకంటే ప్రాణసంకటమైన పరిస్థితి ఏదో నే నూహించుకోలేకపోతున్నాను. ఈ దురవస్థను చూచి నవ్వటానికి నాకు ధైర్యం చాలదు. అందుకే నాకు ఏడుపొస్తుంది."

రంగనాథంగారు టేబిలుపైన మెల్లగా చిటికవేసి "రాత్రి చాలా ప్రొద్దుపోయింది ఇన్‌స్పెక్టరుగారూ! అప్రస్తుత ప్రసంగాలతో కాలహరణం చేయడానికి యిది సమయంకాదు" అన్నారు.

"మీరు ప్రస్తుత విషయాన్నిగురించిమాత్రమే మాట్లాడదలచుకుంటే అందుకు నా అభ్యంతరం లేదు" అన్నాడు సత్యనారాయణ

రంగనాథంగారు ద్వారంవైపు చూస్తూ నాగలింగాన్ని లోపలికి రమ్మన్నారు.

"పిలిచారా బాబూ!" అంటూ నాగలింగం గదిలో ప్రవేశించాడు.

"ఇలా దగ్గరికి రా" అంటూ లేచి నిల్చున్నారు రంగనాథంగారు. "తల పైకెత్తి నావైపు చూడు. ఆ ముసలాడు రేమంటున్నాడో, కాదు, ఏమని సైగచేస్తున్నాడో నువ్వు చూచావుకదూ!"

"పిచ్చివెధవ! బుర్ర దారితప్పిన వాడికేం తెలుస్తుంది బాబూ!" అన్నాడు నాగలింగం.

"అతడి కీమధ్య పిచ్చి పట్టిందేమో నాకు తెలియదు. కానీ నాకు గట్టిగా తెలిసిన విషయంమాత్రం ఒకటుంది. అతడు నీతండ్రి" అంటూ రంగనాథంగారు కుర్చీలో కూర్చున్నారు.

"ఏమిటీ! ఇతడేనా మా అయ్య? నిజంగానా?" నాగలింగం ముఖంలో ఆశ్చర్యం సుళ్లు తిరుగుతోంది.

"అవును. నిండుగా పదహారేళ్ళు జైల్లో వుండి అతడీనాడు, ఈవిధంగా మనకు ప్రత్యక్షమౌతున్నాడు. ఈ పదహారేళ్లుగా నీకు, మీ అక్కకు నిలువనీడ, తినతిండీ, కట్టగుడ్డ యిచ్చి సంరక్షణ చేసినందుకు ప్రతిఫలంగా ఈరోజు మీఅయ్య తనను తలపగులగొట్టింది నేనేనని ప్రేలెత్తి చూపుతున్నాడు. పోనీ నాగలింగం! ఇన్‌స్పెక్టరుగారికి వీలుగా వుంటుంది. నువ్వూ ఆమాటే అనరాదూ!"

"ప్రాణం పోతున్నా ఆమాట అనగల్నా బాబూ! జైల్లో ఆ ముసలాడికి మతిపోయి వుంటుంది. మీ కాళ్లట్టుకుంటాను. తమరతడి మాట ఖాతరు చేయకండి."

"నేను ఖాతరు చేయననుకో! కానీ ఇన్‌స్పెక్టరుగారి సంగతి?"

"ఈ విషయంలో నా నిర్ణయాలు నాకున్నాయి." సత్యనారాయణ లేచి చేతుల్ని టేబిలుకు ఆనించి ముందుకు వంగుతూ అన్నాడు. "ఈ రోజు అతడిపైన చేయి చేసుకున్నది మీరేనని మాత్రం నేను సందేహించలేకపోతున్నాను. ఒకవేళ అతడు పిచ్చివాడైనా కావాలి. లేకుంటే అతనలా మిమ్మల్ని చూపించడానికి వెనుక బలీయమైన కారణమేదో దాగివుండాలి. ప్రస్తుతం యింతకంటే ఎక్కువగా ఏమీ చెప్పలేను."

"తీరిగ్గా ఆలోచించుకోవచ్చు. మీరువెళ్ళి పడుకోండి ఇన్స్పెక్టరుగారూ! అర్ధరాత్రి కావస్తోంది. నాగలింగం! నడవగదిలో పరుపువేసి వుంచావుకదూ?" అన్నారు రంగనాథంగారు.

"వేసివుంచానండీ!" అంటూ నాగలింగం సత్యనారాయణకు దారి చూపించడానికి లాంతరు చేతికి తీసుకున్నాడు.

* * * *

రాత్రి తొలి ఘడియలు గడచిపోయిన తర్వాత మూడో జామున చంద్రోదయమైంది. మేడపైన రంగనాథంగారు, నడవ గదిలో మంచంపైన పడుకున్న సత్యనారాయణ, వంటింటి గుమ్మం దగ్గర కటిక నేలపైన్నే మేనువాల్చిన నాగరత్నం—ఈ ముగ్గురూ తప్ప మిగిలిన కూనలమ్మకోన నిశ్చింతగా నిద్రపోతోంది. తనకూ, రంగనాథంగారికీమధ్య ఓ పెద్ద అఘాతముందనీ, ఆ అఘాతానికి పైన నిర్మింపబడిన వారధి కృతకమైందనీ నాగరత్నం ఎన్నడూ అనుకోలేదు, సాధ్యాసాధ్యాలు విచారించకుండా సూది బెజ్జంలో ఏనుగను దూర్చడానికి ప్రయత్నించే బోళాతనం తన నెక్కడికి తీసుకపోయి వదలిపెట్టగలదో ఆమెకు తెలియదు. మానవుల్లో అంతరాంతరాలున్నాయన్న ప్రాపంచిక పరిజ్ఞానానికి దూరదూరంగా పెరిగిన పల్లెపడుచు నాగరత్నం. ఆమె తన తమ్ముడిలా రంగనాథంగారిలో 'అయ్యగారిని' చూడలేదు. చిన్నవాడు తనతో సరాగాలుపోయి, చక్కిలిగింతలుపెట్టి 'మీ అక్క ముసలిదైపోయింది. నువ్వు నన్ను పెళ్లాడుతావా?' అన్న మాఁవయ్యని మాత్రమే చూచింది. ఆ అపరిపక్వమైన మానసికస్థితిలో నాగరత్నానికి రంగనాథంగారి మాటల్లో లేని అర్థాలు గోచరించాయి. ఊహాతరంగాలపైన కదలిపోతున్న పూలతెప్పలో కూర్చుని తను కట్టుకున్న ఆశాసౌధాలన్నీ పేకమేడలని విడమరచి చెప్పగలిగిన సంఘటన జరిగిన తర్వాత గూడా ఆమె అదే భ్రాంతిలో కొట్టుమిట్టాడిపోతోంది.

ఉండి, ఉండి లేచి కూర్చుంటుంది నాగరత్నం. ఒకవేళ మాఁవయ్య తన మాటను తృణీకరించివేస్తున్నా, ఇది నీకు బుద్ధి కాదని అతడికి నచ్చచెప్పగలిగినవాళ్లు ఉండకపోరన్న ఆశ ఆమె లేతహృదయంలో మళ్ళీమళ్ళీ మోసులు తొడుగుతోంది. పరిపరి విధాల ఆందోళితమైపోయిన ఆమె మనసు చిత్రవిచిత్రమైన ఆలోచనలకు రంగస్థలంగా మారిపోయింది. ఒక అమాయకురాలికి మోసము జరిగిపోతోందన్న చింతలేకుండా ఈ లోకులు ఎలా నిద్రపోగలుగుతున్నారు? ఒకరిని అని ఏం లాభం? ఒకేరక్తం పంచుకుని పుట్టిన తమ్ముడే తనని అవతలికి పొమ్మని కసిరికొట్టేశాడు. తనిప్పుడేం చేయాలి? దొమ్మీలు, దోపిడీలు, దొంగతనాల్లాంటి అక్రమాలు జరిగినప్పుడు, అన్యాయంపాలైనవాళ్లు పోలీసువాళ్ళతో మొరపెట్టుకోడం లోకంలో సర్వసాధారణంగా జరుగుతున్న విషయం కానీ, తనెవరితో మొరపెట్టుకోవాలి? ఎవరు వింటారు? తనకుజరిగింది అన్యాయంకాదా? అక్రమంకాదా? దగా కాదా?

నాగరత్నం లేచి నిల్చుంది. ఇన్స్పెక్టరుగారు క్రిందికి దిగివచ్చి నడవగదిలోకి వెళ్లి పడుకుని ఎంతోసేపు కాలేదు. ఈపాటికింకా ఆయనకు నిద్రపట్టి వుండదు. ముసలివాడికొకడికి తలమీద దెబ్బ తగిలిందని తెలియగానే రాత్రికి రాత్రే పరుగెత్తుకువచ్చిన మనిషి, తన మొరను చెవుల్లో వేసుకోడా? ఆయనతో తన గోడు చెప్పుకుంటే?

ప్రవాహంలో పడి క్రిందుమీదులై కొట్టుకపోతూ చేతికి దొరికిన పూచికపుల్ల ఆసరాతో గడచి గట్టెక్కాలని అభిలషించే మానవమాత్రుడికి మల్లే నాగరత్నం అడుగు ముందుకు వేసింది.

సరిగ్గా ఆసమయానికి నిద్రపట్టక గదిలోనుంచి బయటికివచ్చి డాబాపైన పచారు చేస్తున్నారు రంగనాథంగారు. జీవితంలో ఆయనకు బొత్తిగా నిద్రపట్టని రాత్రులను వ్రేళ్ళమీద లెక్కపెట్ట వచ్చు. ఒకసారి క్రొత్తగా వచ్చిన కలెక్టరు 'ఈ మావలమ్మకోనలో తంటాలన్నీ మీ మూలంగానే వస్తున్నట్టున్నాయి' అన్నాడు. ఆ రోజు రాత్రి రంగనాథంగారికి నిద్రపట్టలేదు. ఇంకొకసారి ఫారెస్టు వాచరొకడు "నిన్ను కోనలో లెక్కించకపోతే నాకు మారుపేరు పెట్టు" అన్నందుకు నిద్రరాక పడకపైన దొర్లుతూ ఆయన ఒక రాత్రంతా మేలుకుని వుండిపోయారు.

వసంతం జరుగుతున్నా అర్ధరాత్రయ్యేసరికి కోనలో చలిగాలి వీస్తుంది. చెవులకు మఫ్లర్ చుట్టుకుని, సిగరెట్టు కాల్చుకుంటూ రంగనాథంగారు పిట్టగోడ వెంబడే మెల్లగా తిరుగుతున్నారు. ఐదు నిమిషాల కొక్కొక్కటిగా సిగరెట్లు కాలిపోతున్నాయి. పెట్టెలో అగ్గిపుల్లలన్నీ అయిపోయాయి. ఇక అగ్గిపెట్టెకోసం నాగలింగాన్ని లేపడంకన్నా గత్యంతరం లేదు, అవసరానికి ఒకటి రెండు అగ్గి పెట్టెల్ని అతడు గదిలో ఎక్కడైనా "స్టాకు" చేసి వుంటాడు. రంగనాథంగారు నాగలింగాన్ని ఒకసారి పిలిచి చూచారు. గదికివతల చాపపైన పడుకుని గుర్రు పెడుతున్న నాగలింగానికి ఆ పిలుపు వినిపించలేదు. మెలకువతో వుంటే సరే, నాగలింగం ఎంతసేపైనా అలావుండి పోతాడు, కళ్ళు మూసుకుంటే మాత్రం అతడిది కుంభకర్ణుడి నిద్ర!

రంగనాథంగారు నాగలింగం దగ్గరకు వెళ్తూ మధ్యలో హఠాత్తుగా ఆగిపోయారు. క్రింద వంటగదికీ, నడవకూ మధ్య హాలుకు నాలుగువైపులా గదులుండడంవల్ల కాంతి ప్రసరించడం కోసం పైకప్పుకు మూడు చోట్ల అద్దాలు పొందుపరిచారు. ఆ అద్దాల గుండా వెన్నెల హాల్లో పడుతోంది! వెన్నెల కాంతిలో స్పష్టంగా చూచారు రంగనాథంగారు. నాగరత్నం నడవగదివైపు వెళ్తోంది!

రంగనాథంగారు చరచరా నాలుగడుగులు ముందుకువేసి చివరి అద్దందగ్గర నిల్చున్నారు.

నాగరత్నం ద్వారం దగ్గరఆగి, వారగా వేసిన తలుపుగుండా లోపలికి చూస్తోంది. ఆమె పెదవులు కదులుతున్నాయిగానీ మాటలు మాత్రం డాబా పైకి వినరావడం లేదు.

మరికొంత సేపటికి నాగరత్నం తలుపు తీసుకుని గదిలోపలికి వెళ్ళింది.

రంగనాథంగారు నాలుగు క్షణాలపాటు ఆలోచిస్తూ వుండి పోయారు. మరుక్షణంలో నాగలింగం దగ్గరికి ఓ గంతువేసి అతణ్ణి తట్టి లేపి కూర్చోబెట్టారు.

"ఏంబాబూ! ఏం జరిగింది?" అంటూ లేచి నిల్చున్నాడు. నాగలింగం.

"అదికాదురా నాగలింగం! క్రింద మీ అయ్య అలా బాధలో అఘోరిస్తుంటే, యిక్కడ పడుకోడానికి నీకు మనసెల్లా ఒప్పింది? వెళ్ళు. ఈ రాత్రి అతడిదగ్గరే పడుకో" అన్నారు రంగనాథంగారు.

"వెళ్తాను బాబూ!" అని నాగలింగం చాప చుట్టుకుంటూ, "మీకు సిగరెట్లు, అగ్గిపెట్టె ఉన్నయ్యా బాబూ?" అన్నాడు.

"అన్నీ ఉన్నాయిలే! నువ్వు వెళ్ళు" అంటూ రంగనాథం గారు గదిలోపలికి వెళ్ళారు.

చాపచుట్టి భుజాన వుంచుకుని నాగలింగం మెట్లకేసి నడవ సాగాడు.

* * * *

మంచంపైన ఆరంగుళాల మందమున్న పరుపు సత్యనారాయణకు కంటకశయ్య అయిపోయింది. కన్ను పొడుచుకున్నా అతడికి కునుకు రావడంలేదు. గదిలో గుడ్డి దీపం ఒకటి వెలుగుతోంది. ఆ వెలుగులో వస్తువులకన్నా వాటి నీడలే స్పష్టంగా కనిపిస్తున్నాయి. సత్యనారాయణకు పడుకోకముందు ఓ గ్లాసుడు మంచినీళ్లు త్రాగక పోతే నిద్రపట్టదు. గదిలో మిగిలినవన్నీ వున్నాయిగాని మంచినీళ్ళ కూజామట్టుకు లేదు. సత్యనారాయణ నిట్టూరుస్తూ గడియారం చూచుకున్నాడు. ముళ్లు రెండూ పన్నెండు దగ్గర కలుసుకుని, విడి పోయి కూడా అరగంట కావస్తోంది.

తలుపుదగ్గర ఏదో చప్పుడయింది. చీరచెంగు రెపరెపలాడి నట్టు, గాజులు గలగలమన్నట్టు మెల్లగా వినవచ్చిన ఆ చప్పుడువిని సత్యనారాయణ ఉలికిపడ్డాడు. ఇది, ఆయుధాలన్నీ విఫలమైపోయిన తర్వాత చిట్టచివరి ప్రయత్నంగా తన పైకి సంధింపబడుతున్న బ్రహ్మాస్త్రం కాదుగదా!

"ఎవరక్కడ?" సత్యనారాయణ సూటిగా ప్రశ్నించాడు.

కంపిత స్వరంతో "నీకు చెల్లెలిలాంటిదాన్ని అన్నా! మరేమీ అనుకోకు. ఒక మాట చెప్పుకోవాలి" అంది నాగరత్నం.

"ఏమిటది?"

లోపలికి వెళ్ళి తలుపుచాటున నిల్చుంది నాగరత్నం. "దిక్కు లేని వాళ్లకు దేవుడే దిక్కంటారు. ఆ దేవుడే ఈ రోజు నిన్నిక్కడికి తీసుకొచ్చాడు. నమ్మిచెడిన ఆడదాన్ని నేను. ఇంతకాలం నాకు నమ్మకాలు చెప్పి, యిప్పుడాయన ఎవరెనో పెళ్లాడబోతు న్నాడు. నాలాంటిదానికి మేలు చేస్తే నీకు పుణ్యముంటుంది. నీకు నాలాంటి అక్కచెల్లెళ్లు వుండకపోరు. నాకు తెలుసు. నువ్వు చెబితే ఆయన తప్పకుండా వింటాడు."

దుఃఖోద్వేగంతో పెనవైచుకపోయిన నాగరత్నం మాటల్ని వింటూ సత్యనారాయణ నిర్విణ్ణుడైపోయాడు.

జవాబుకోసం ఎదురుచూస్తూ అలాగే తలుపుదగ్గర నిల్చుంది నాగరత్నం.

"ఎవరమ్మా ఆయన! రంగనాథంగారేనా?" కాసేపటికి తల పైకెత్తి నాగరత్నాన్ని చూస్తూ అడిగాడు సత్యనారాయణ.

"అవును" అని చెప్పడానికి నోరు తెరవబోతున్నది నాగ రత్నం.

తీవ్ర ప్రహారానికి లోనైన తలుపు దభాలున తెరుచుకుంది. ఆ తాకిడికి తూలిపోయి నాగరత్నం సత్యనారాయణ ఒడిలో పడిపో యింది.

ద్వారం దగ్గర పళ్ళుగీటుతూ నిలబడి వున్నాడు నాగలింగం.

అశనిపాతంలా జరిగిపోయిన ఊహించని ఈ హఠాత్పరిణామాన్ని చూస్తూ సత్యనారాయణ మంచుగడ్డలా బిగుసుకు పోయాడు. కళ్ళప్పగించి చూస్తున్నా అతడికి చూస్తున్న దేమిటో స్ఫురించ లేదు. చెవులప్పగించి వింటున్నా ఆవింటున్న దేమిటో అతడికి అవగతం కాలేదు. చైతన్యం కోల్పోయి సత్యనారాయణ మంచంమీద అలా జడపదార్థంలా కూలబడి వుండగానే నాగలింగం తోబుట్టువును జుట్టు పట్టుకుని బరబరా లాక్కెళ్ళి సింహద్వారం తెరచి బయటకు త్రోసివేశాడు. నాగరత్నం కుయ్యో మొర్రో అని అరిచింది. ఆ అరుపులకు యింట్లో జనమంతా మేలుకుని పరుగుపరుగున ఆ గదిదగ్గిరికి వచ్చి మూగారు. అందరి కళ్ళలోనూ ఆశ్చర్యం పరవళ్లు త్రొక్కుతోంది, ఒకవేళ ఆడదానికైతే బుద్ధిలేక పోయింది. ఇతడి కెందుకు లేకపోవాలి? పైగా పెద్ద ఉద్యోగి. ఉద్యోగం చేస్తే అయిపోయిందా? శునకాన్ని కనకపు సింహాసనంపైన కూచోపెట్టవచ్చు గానీ, దాని సహజ స్వభావాన్ని మరమ్మత్తు చేయడం ఎవరితరం? ఇంతటిభావాన్ని తమలో దాచుకున్న రూపుపిశాచాలు జతలు జతలుగా చేరి శూలాలై పొడిచి, బరిసెలై చీల్చి, అగ్నిశిఖలై సత్యనారాయణను కాల్చి వేయసాగాయి.

నాటకంలోలా శరవేగంతో ఒకదానితర్వాత ఒకటిగా జరిగిపోతున్న ఈ సంఘటనలకు పతాక పరిణామంగా రంగనాథంగారు "ఏమిటి, ఏమిటి" అంటూ మెట్లుదిగి క్రిందికి వచ్చేశారు.

ఒక కాలును ద్వారబంధంమీద మోపి, చొక్కా చేతులు పైకిమడిచి, సత్యనారాయణను చురచుర చూస్తూ మీసం మెలి వేస్తున్న నాగలింగం "నీతులు మాట్లాడిన మనిషిని చూస్తారా బాబూ! చూడండి. సిగ్గూ శరమూ లేకపోతేసరి! మళ్ళీ వుద్యోగం వెలగబెడుతున్నాడు. ఛీ" అంటూ ముఖం త్రిప్పుకున్నాడు.

రంగనాథంగారు ఒకసారి మెల్లగా నవ్వారు. నవ్వుతూ నాగలింగం భుజంపై చేయివేసి "నువ్వువెళ్ళరా బాబూ! వెళ్ళిపడుకో" అని సత్యనారాయణవైపు తిరిగారు.

ఈ దెబ్బతో సత్యనారాయణను పట్టిన గ్రహం వదలిపోతుందనుకున్న వాళ్ళకుమాత్రం ఆశాభంగమే కలిగింది.

రంగనాథంగారు నాగలింగాన్ని ఎంతచల్లగానైతే మందలించారో అంత తేలికగానే సత్యనారాయణని కూడా మందలించారు.

"మానవుడి బుద్ధికి మేతగా అప్పుడప్పుడూ గడ్డి కావలసివస్తుంది. మీరు గడ్డితిన్నందుకు నాకు కోపంలేదు. చింతగావుంది."రంగనాథంగారి మందలింపు అసాధారణమైన పంథాలో కొనసాగిపోతోంది. "ఇది అగ్గి అనీ, ముట్టుకుంటే వ్రేలు కాలిపోతుందని కుర్రవాడికి తెలియదు. తెలియకపోవడంచేతనే వ్రేలు కాలిపోవడం జరుగుతుంది. అందుకు కోప్పడి ఏంలాభం? ఇంకా ఒకఝాము రాత్రి వుంది ఇన్స్పెక్టరుగారూ! పడుకోండి."

* * * *

ది

భారత లక్ష్మి బ్యాంకు

లిమిటెడ్.

రిజిష్టర్డు ఆఫీసు: మచిలీపట్టణం.

సెంట్రల్ ఆఫీసు: మద్రాసు.

(స్థాపితం: 1929)

బ్రాంచీలు:

మచిలీపట్టణం, గుడివాడ, నూజివీడు, నర్సాపురం, రాజోలు, గవర్నరుపేట (విజయవాడ), కాకినాడ, రామారావుపేట (కాకినాడ), విశాఖపట్టణం, బొబ్బిలి, కావలి, గూడూరు, మద్రాసు, విజయవాడ.

ఫిక్సెడు డిపాజిట్లు సం॥ కు నూటికి రు. 3-8-0 మొదలు రు. 4-0-0 వడ్డీతో అంగీకరింపబడు చున్నవి.

కరెంటు, సేవింగ్సు, షార్టునోటీసు, కాల్ డిపాజిట్లు అంగీకరింపబడుచున్నవి.

మా మూడు సం॥ ముల క్యాష్ సర్టిఫికేటు ఒక ప్రత్యేకత.

ధాన్యము, అపరాలు మొదలగు అన్ని సరకుల హామీపై అప్పులు యివ్వబడును.

అన్ని రకములయిన బ్యాంకింగ్ వ్యాపారములు జరుపబడును.

వివరములకు మా బ్రాంచీలకు వ్రాయప్రార్థన.

డా॥ వేంకటరత్నం,
మేనేజింగు డైరెక్టరు.

వదలిపెడితే వేయిముక్కలైపోవడానికి సిద్ధంగావున్న తలను రెండుచేతుల్తో అదిమి పట్టుకుని లేచాడు సత్యనారాయణ. ఒక్క పెట్టున అతడి మనసును ఆవరించుకున్న స్తబ్దత అప్పుడప్పుడే విడిపోతోంది. కల్లోలకాసారంలో తబ్బిబ్బుపడిపోతున్న జాబిల్లి ప్రతిబింబంలాంటి అస్థిరచిత్తం అతణ్ణి "పో, వెళ్లిపో, ఇక్కడనుంచి ఎంత త్వరగా వెళ్లిపోతే అంత మంచిది" అని ఆదేశించింది. సత్యనారాయణ కింతమాత్రమే తెలుసు. తనెలా పైకి లేచాడో, ఏత్రోవ వెంబడి వరండాలోకి వచ్చేశాడో అతడికి తెలియదు.

గగనంలో కారాజాకు మేఘాలు అడ్డుతగిలినట్టున్నాయి. మండి పోతున్న సత్యనారాయణ కళ్లకు గ్రుడ్డివెన్నెల్లో నీడా, గోడా, మేడా అంతా ఒకే రీతిగా గోచరమౌతోంది. కళ్లు నులుముకుంటూ వరండాలో నడిచిపోతున్న సత్యనారాయణ పాదానికేదో చల్లగా తగిలింది. అతడు ముందుకు వేయబోతున్న అడుగును వెనక్కి తీసేశాడు.

నాగరత్నం తలను తొడమీద పెట్టుకుని ఆమెముఖంలోకి చూస్తూ విగ్రహంలా కూర్చుని వున్నాడు నరసయ్య.

"ఏమిటది? ఏమిటది?" దిక్కులం తోచక ప్రశ్నించాడు సత్యనారాయణ.

"నెత్తురు! నెత్తురు!" రక్తసిక్తమైపోయిన చేతులతో ముఖాన్ని దాచుకుంటూ పైకిలేచాడు నరసయ్య. "ఇదేమిటో తెలియడం లేదా బాబూ! ఇది కూనలమ్మకోన. కాపేపాలకు నిలవనీడ. కలహాలకు రచ్చబండ. మనుషుల్లోనే పులుల్ని పొట్టేళ్లనీ, తోడేళ్లనీ మండేళ్లనీ పుట్టించి భగవంతుడు వాళ్లకోసం కట్టిపెట్టిన యిల్లు. ఈ కూనలమ్మకు వచ్చినెత్తురు మైపూతలు కొత్తవి కావుబాబూ! పాతవే."

నరసయ్య మాట్లాడుతున్నంతసేపూ విని, తలనడ్డంగా ఊపుతూ సత్యనారాయణ ఉన్మత్తుడులా "నాకేం తెలియదు. నన్ను వెళ్ళి పోనివ్వు" అంటూ చరచరా వరండా చివరికి వచ్చేశాడు.

"ఆగండి! మీరుకూడా వెళ్ళిపోతే నా సొదను నేనెవరితో వెళ్ళబుచ్చుకోవాలి?" అంటూ నరసయ్య సత్యనారాయణ కడ్డంగా వచ్చేశాడు.

"ముందట నాకీ సంగతి చెప్పండి. ఏం చేసిందని నాబిడ్డకీశిక్ష?"

సత్యనారాయణ ఏదో చెప్పబోయాడు.

"మనుషులంగా పుట్టడమేనా మేము చేసినతప్పు. అవును. అవునులే" నరసయ్య వికటంగా నవ్వేశాడు. నిండుగా మునిగిన తర్వాత చలిబాధవుండదు. జీవితం ఎంత దుర్భరంగా పరిణమించాలో అంత దుస్సహంగా పరిణమించిన తర్వాత ఏడుపు నవ్వవుతుంది నవ్వు ఏడ్పవుతుంది. అప్పుడు నవ్వినా, ఏడ్చినా అందు కర్థ మొక్కటే! నవ్వుతూనవ్వుతూవుండగానే నరసయ్యముఖంలోవిచార మేఘాలు అలుముకున్నాయి. కళ్ళల్లో కన్నీళ్ళు క్రమ్ముకున్నాయి. "నేను పదహారేళ్ళు జైల్లో వుండి వచ్చాను. ఎందుకని? పింగప్పనైన నేను కారెక్కించేశానని లోకం అనుకుంటోంది. రంగనాథంగారు ఒప్పుకోకపోవచ్చు. కానీ నేను నిజం చెబుతున్నాను. ఆయన కావాలని చేశారో, లేకుంటే అది ప్రమాదమో అది దేముడికే తెలియాలి. కారెక్కించింది ఆయనగారు. అప్పుడు నేను గంగిరెద్దుని! ఉలవలు తినమన్నప్పుడు ఊఁ అన్నట్టే ఊపిరి కుదువ పెట్టమన్నప్పుడు కూడా ఊఁ అన్నాను. రెండేళ్ళకన్నా ఎక్కువశిక్ష పడదన్నారు. నా కొడుకుని చదివిస్తామన్నారు. కూతురికి పదికరాల నేల వ్రాసి పెడతామన్నారు. నాకు పదహారేళ్ళశిక్ష పడింది. అప్పీలు చేయమని కాళ్ళా వేళ్ళాపడి బతిమాలుకున్నాను. ఎక్కడ చేశారు? నాప్రాప్తానికి నన్ను వదిలేశారు. నాగరత్నమైనా, బిడ్డలైనా సుఖంగా బ్రతుకుతుంటారన్న ఆశతో ఇంతకాలం ఆ కమ్ముల్లో బ్రతుకు వెళ్లబుచ్చాను. నిన్న తిరిగొచ్చి చూచుకుంటే యిక్కడంతా తల్లక్రిందులుగా వుంది. పదహారేళ్లకుముందు నా కళ్లెంత గుడ్డివో, యిప్పుడు నా కుమారుడికళ్లంత గుడ్డివి. మెడబట్టి గెంటివేయగా ఆడబిడ్డ వచ్చి మంచంకోడుపైన పడింది. దాని తల పెట్లిపోయింది. నిన్న సాయంత్రం వాడికి వెంట్రుక వాసిలో చావు తప్పింది. వాడిపైకి గురిపెట్టినదెబ్బ నాకు తగిలింది. ఏంచేశామని మాకీశిక్ష? ఇన్స్పెక్టరుగారూ! మీరే చెప్పాలి. ఇంకొకరు చెప్పలేరు. న్యాయానికి అండ మీరు. తప్పుచేస్తే దండించేది మీరు. మిమ్మల్ని గాకపోతే నేనెవరిని అడుగుతాను? చెప్పండి. ఏం చేశామని మాకీశిక్ష?"

నరసయ్య కంఠం గద్గదికమైపోయింది. ఎవడి జీవితపు పెను తీదుపైన సంజవెలుగులు ప్రసరిస్తున్నాయో, ఎవడి జీవిత ఘోరాటవిలో ముండ్లూ గుండ్లూ, పుట్టలూ గుట్టలూ తప్ప నవ్వులాంటి పువ్వు, ఆనందంలాంటి సెలయేరు, అనురాగంలాంటి పికకూజితం ముచ్చటైనా లేవో ఆ నరసయ్య శోకగాథకు ఫలశ్రుతిగా సత్యనారాయణ కళ్లల్లోంచి రెండు కన్నీటిబొట్లు మాత్రం క్రిందరాలాయి.

తట్టుక్రింది కోడిపుంజు రెక్కలు తటతటలాడించి "ఇంకా తెల్లవారలేదు. పడుకోండి, పడుకోండి" అని లోకమంతా వినబడేటట్టు ఎలుగెత్తి కూసింది.